# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక


శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

గూడూరి వెంకట రత్నం

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ఎన్ రామతారక పరబ్రహ్మ శాస్త్రి

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ వి.వి. ఆర్ ప్రసాదరావు

డా॥ యమ్ స్వర్ణముఖి



VOLUME 32 ISSUE 5

No. OF PAGES 40

JANUARY 2013

5సం॥ల చందా రూ. 250

2సం॥ల చందా రూ. 120

సంవత్సర చందా రూ. 60

విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు A/C Y.S.C.K.P.M

చారిటబుల్ ట్రస్ట్ పేరుతో డ్రా చేయండి.

M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన

చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL


**ఈ సంచికలో**............................ ....... **పేజీ**


| | |
|---|---|
| భద్రవాక్యం | 2 |
| యోగి వేమన | 3 |
| శ్రీబాబూజీ ఉవాచ | 4 |
| శ్రీమాతాజీ అభిభాషణ | 6 |
| సన్నిధిలో సంభాషణ | 9 |
| శ్రీకాళీగార్డెన్స్‌లో కార్యక్రమాలు | 11 |
| యోగవాశిష్ఠము | 12 |
| గురు కృపాహి కేవలమ్ | 14 |
| ఆహ్వానము | 16 |
| అహం బ్రహ్మోస్మి | 17 |
| శ్రీకృష్ణ కర్ణామృతం | 19 |
| పరిప్రశ్నేన సేవయా | 21 |
| సత్సంగ మహిమ | 22 |
| స్థిత ప్రజ్ఞుడు | 25 |
| లక్ష్యార్థ సిద్ధి | 27 |
| అలసత్వమును పారద్రోలాలి | 29 |
| శ్రీగురు పాదాలు | 30 |
| తలచుకున్నప్పుడే అనుష్ఠానం ఆరంభించు | 32 |
| శివానందలహరి | 33 |
| సమర్థ సద్గురునాధుని దివ్య చరిత్ర | 35 |
| శ్రీరాధామాధవ రస సుధ | 37 |
| విష్ణు కథలు | 38 |

# భద్రవాక్యం

– పరాశర ప్రసాద్

నిరస్త విషయాసంగం సన్నిరుద్ధం మనోహృది ।
యదా యాత్యాత్మనో భావమ్ తదాతత్పరమం పదమ్ ॥

(అమృతబిందూపనిషత్)

విషయాలు లేకుండా జీవితం ఎలా గడుస్తుంది? అనుకుంటాడు మానవుడు. విషయ చింతన ద్వైత సంస్కారాన్ని పెంచుతుంది ముక్తికి దూరమవుతాడు. దీని నుంచి రక్షింపబడాలంటే మనస్సుని నిర్విషయం చేసుకోకతప్పదు. మనస్సు నిర్విషయం చేసుకుని జీవించగలగాలి. అప్పుడే ముముక్షువు అనిపించుకుంటాడు. ఆత్మకు పరమమైన స్థానం స్థితి. అలాగే మనస్సునకు పరమమైన స్థానం స్థితి. ఆత్మకు భిన్నంగా ద్వైత రూపంగా ఉన్న మనస్సు తన ద్వైత రూపాన్ని విడిచి ఆత్మయందు లయమైనప్పుడు విషయాసక్తిని నిరుద్ధ స్థాయిలో విడుస్తుంది.



అలా జరగనప్పుడు "నేను" స్మరణ చేసినప్పటికి మనస్సు దేహభావాన్నిగాని, యింద్రియ భావాన్ని గాని లేక విషయ పరిమితమైన విషయభావాన్ని గాని పొందుతుంది. అంతేకాని ఆత్మ భావాన్ని పొందటం లేదు. ఆత్మభావం అనంతం. అపరిమితం. 'నేను' అనే ఆత్మభావం స్థిరమైనది. నిశ్చల మైనది. నిర్మలమైనది. అక్కడ పెనుగులాట ఉండదు. ఇంద్రియ దృష్టిగాని, దేహదృష్టి గాని, విషయాసక్తిగాని ఉండదు. అది అభావ స్థితి. పూర్ణత్వంలో రాజీ ఉండదు.

ప్రాపంచిక వ్యవహారాలలో హెచ్చు తగ్గులు ఉండవచ్చు. మనస్సు నిర్విషయ మవ్వటానికి ఏమాత్రం మినహాయింపు ఉండదు. సంపూర్ణంగా విషయ విసర్జన జపిగినప్పుడే మనస్సు ఆత్మలో లయమై ఆత్మానందాన్ని కలుగజేస్తుంది. ఆత్మ అంటే 'నేను' అనేది తన దేహానికి గాని, వ్యవహారాలకిగాని, ఇంద్రియాలకిగాని, విషయలకిగాని సంబంధించినది ఎంతమాత్రము కాదని గుర్తించి అది అపరిమితమైన అనంతమైన సర్వవ్యాపకమైనదిగా గుర్తించటమే జ్ఞానము.

*

# యోగి వేమన

గత సంచిక తరువాయి

- శ్రీ బులుసు వెంకటరమణయ్య

ఋషులెరుంగనట్టి విషయంబు భువి లేదు
వారు చెప్పినంత వరుస నగును
తెలియక నేడువారు దేబెలు వినుమయా
విశ్వదాభిరామ! వినుర వేమ!

తాత్పర్యము -



పూర్వకాలపు ఋషులకు తెలియని విషయము లేదు. వారు చెప్పినట్లే జరుగుచుండును. ఇది తెలియక వారిని నిందించువారు దేబెలె యగుదురు.

ఎక్కువయును తక్కువెట్టివి? వారికి
తనువు సతముకాదు తథ్యమరయ
నెఱిఁగి తిరుగలేరిఁకేమన మూర్ఖులు
విశ్వదాభిరామ! వినుర వేమ!

తాత్పర్యము -

భగవంతుని దృష్టిలో ఎక్కువ తక్కువ భేదములు లేవు. ఈ శరీరములు నిత్యము కావు. మూర్ఖులు యీ సంగతిని తెలిసికొనలేకున్నారు.

ఎడ్డెఁదెల్పవచ్చు నేడాదికైనను
మౌనిఁదెల్పవచ్చు మాసముననె
మొప్పెఁదెల్పరాదు ముప్పదేండ్లకునైన
విశ్వదాభిరామ! వినుర వేమ!

తాత్పర్యము -

జ్ఞానములేనివానికి ఏడాది నాటికైనను బోధింపవచ్చును. మాటలాడక ఉండువానికి నెలలో బోధింపవచ్చును. కాని మూర్ఖునకు ఎన్నేండ్లు బోధించినను తలకెక్కదు.

ఎంత చదువు చదివి యెన్నిటి విన్నను
హీనుఁడవగుణంబు మానలేఁడు
బొగ్గు పాలఁగడుఁగ బోవునా నైల్యంబు
విశ్వదాభిరామ! వినుర వేమ!

తాత్పర్యము -

ఎంత చదివినను, ఎన్ని మంచి మాటలు విన్నను నీచుడు తన చెడ్డ గుణమును విడువడు. నల్లని బొగ్గును పాలతో కడిగినను దాని నలుపు పోదుకదా!

# శ్రీబాబూజీ ఉవాచ

– పరాశర ప్రసాద్

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో "ఫిలాసఫీ ప్రొఫెసర్" ప్రసాదరావు గారు శ్రీ బాబూజీ మహరాజ్‌ను ప్రశ్నిస్తూ "సంసారిక జీవితం నాకు సాధనకు ప్రతిబంధకంగా ఉంది కాబట్టి నా భార్య, పిల్లల సంరక్షణ నిమిత్తం కొంత ధనరూపేణ సహాయంచేసి, నేను ఒంటరిగా ఏ అరణ్యాలకో వెళ్లి, తపస్సు చేసుకోవాలని ఉంది" అని అన్నారు.



శ్రీ బాబూజీ మహరాజ్ మాట్లాడుతూ సాధనకు గృహస్థాశ్రమం చాలా అనుకూలంగా ఉంటుంది. గృహస్థుగా ప్రాపంచిక సుఖదుఃఖాలు అనుభవ పూర్వకంగా తెలుసుకో గల్గుతావు. సంసార సాగరంలో జననము, మరణము, ఆకలి, దప్పిక, శోకము, మోదము అనేవి సహజమైన ఆరు అలలు. వాటికి భయపడి ఏ అరణ్యానికో, ఏ గుహకో పారిపోవుటలో మీ సమస్యలు పరిష్కారం అవుతాయని గ్యారంటీ ఉందా? పోనీ, మీ సాధన అరణ్యంలో సక్రమంగా సాగుతుందని నమ్మకం ఉందా? మీ భార్యా, పిల్లల్ని మరచిపోగలరా? వీటన్నింటినీ సాధించాలి అంటే మీ ప్రవృత్తిలో మార్పురావాలి. అంతవరకూ ఏమీ ప్రయోజనం ఉండదు. కాయలో పచ్చిదనం ఉన్నంతవరకూ, అది చెట్టుని అంటిపెట్టుకుని ఉండవలసినదే కదా! అది పక్వస్థితికి చేరిన తరువాత ఆ చెట్టు నుంచి, విడిపోతుంది.

అలాగే నీలో గుణాలను ముందుగా రహితం చేసుకో! అప్పుడు నీ సంసారం నీకు ప్రతిబంధకంగా ఉండదు. నీ భార్య పిల్లలలో దైవత్వాన్ని చూడగలుగుతావు. గృహస్థాశ్రమంలో ఏ చిన్న తప్పుచేసినా సరిదిద్దుకునే అవకాశం ఉంది. సన్యాసాశ్రమంలో అటువంటి అవకాశం ఉండదు. సన్యాసి జీవితము చాలా దుర్భరమైనది. భగవద్గీతలో భగవానుడు కర్మచేయవద్దని ఎన్నడూ చెప్పలేదే? నీవు చేయవలసిన కర్మ సక్రమంగా నిర్వహించి ఫలితం మాత్రం నాకు వదిలిపెట్టమని అన్నాడు. మీరు అన్యధా భావించనంటే మీకొక దృష్టాంతం చెపుతాను".

"మానవుడు ఏ అరణ్యానికో వెళ్లి, సన్యసించవలసిన అవసరం లేదు. గృహస్థాశ్రమంలోనే ఆ అనుభవాన్ని పొందుతావు. తాము ఎంతో ప్రేమతో పెంచిన పిల్లలు పెరిగి పెద్దవారై తలిదండ్రులకు దూరమై పోతున్నారు కదా?! కాలక్రమేణా వార్థక్యం ప్రాప్తించిన తరువాత చూపు తగ్గిపోతుంది. కర్ణేంద్రియాలు వినే శక్తిని కోల్పోతాయి.

దంతములు ఊడిపోతాయి. అన్ని పదార్థాలు, తినడానికి ఉండదు. తాము ఎంతో ప్రేమగా పెంచిన సంతానము తమను ఛీదరించుకుంటారు. ఈ స్థితిలో నున్న మానవుడి మనస్సు చెందే వ్యధ ఎవరూహించగలరు చెప్పండి?! తప్పక జీవితం మీద విరక్తి కలుగుతుంది. ఆ స్థితిలోనైనా, సర్వజీవులు ఆదరించే భగవంతుని స్మరిస్తారా? అలా చేయరు అందువలననే గృహస్థుగా ఉంటూ, సమర్థులైన గురుమూర్తిని ఆశ్రయించి గృహస్థుగా తాను పొందిన అనుభవాలను విచారణ చేసి, తన జీవిత పరమార్థమేమిటో తెలుసుకుని, దానిని చేరుకోటానికి అవరోధంగా ఉన్నవాటిని తొలగించుకోవాలి. ఉల్లిపాయలో పొరలనన్నింటినీ తొలగిస్తే మిగిలేది ఏముంది? తానే మిగులుతాడు. గృహస్థుగా మంచిసాధన చేస్తే వాన ప్రస్థాశ్రమం చేరి, చివరకు జీవిత పరమార్థాన్ని తెలుసుకుని, విరాగియై, మోక్షస్థితిని అనుభవిస్తాడు. ఇంతకన్న కావలసింది ఏముంది? అని అన్నారు శ్రీ బాబూజీ మహరాజ్.

ఇంకా మాట్లాడుతూ "మీకొక ఉదంతాన్ని చెపుతాను. సంసార జీవితంలో విసుగు చెందిన ఒక వ్యక్తి అరణ్యంలో తపస్సు చేసుకునే ఒక యోగిని ఆశ్రయించి, తనకు మోక్షాన్ని పొందే మార్గాన్ని తెలియజేయమని అడిగాడు. ఆ యోగి సమాధానం చెప్తూ, పిచ్చివాడా ఈ అరణ్యంలో ఏముంది? నీవు ఎక్కడనుంచి వచ్చావో అక్కడికే వెళ్లి, అన్వేషణ చేయి, తెలుసుకుంటావు అని అన్నారు యోగి.

ఆ సమాధానంతో తృప్తి చెందని ఆ వ్యక్తి దేశసంచారం చేసి, అన్ని పుణ్యక్షేత్రాలు దర్శించి, విసుగుచెంది తిరిగి అరణ్యానికి చేరాడు. అక్కడ కూర్చుని తన జీవితంలో పొందిన అనుభవాల్ని విచారణ చేయటం ప్రారంభించాడు. తనకు ఎదురుగా ఉన్న వృక్షమునుండి ఆకులు రాలిపోతున్నాయి. రాలిపోయిన ఆకులు గాలికి ఎగిరి పోతున్నాయి. ఆ దృశ్యాన్ని తిలకిస్తూ సంతోషంతో ఒక్కసారిలేచి బిగ్గరగా 'తెలిసిపోయింది. జీవిత పరమార్థం!' అంటూ నాట్యం చేయడం మొదలు పెట్టాడు. ఇంతలో తానింత వరకు గమనించిన వృక్షము ఒక యోగిగా మార్పుచెందింది. ఆశ్చర్యపోయాడు! తాను చాలా సంవత్సరాలక్రితం ఈ అరణ్యంలోనే కలుసుకున్న యోగి పుంగవుడే! సాష్టాంగ నమస్కారము చేసుకున్నాడు. "స్వామీ మీరు ఆనాడు చేసిన బోధ ఈ రోజు అనుభవపూర్వకంగా తెలుసుకోగలిగాను. ఈ సృష్టిలో పుట్టినవన్నీ రాలిపోయేవే! మిగిలేది వాటికి ప్రకాశాన్నిచ్చే చైతన్యమే చూశారా. గృహస్థునిగా విసుగు చెందిన వ్యక్తి, సమర్థులైన గురువునాశ్రయించి, గృహస్థాశ్రమంలోనే ఉండి అన్నిరకాల అనుభూతులను పొంది చివరకు జీవిత సత్యాన్ని తెలుసుకోగలిగాడు. ఈ ఉపాధి రాలిపోవలసిందే! కాని దీనిని ప్రకాశింపచేసే నేనుమాత్రం శాశ్వతమైనది. అని అన్నారు శ్రీ బాబూజీ మహరాజ్.

*

# శ్రీ మాతాజీ అభిభాషణ

-జపమాలా ప్రసాద

కన్నప్పలో వ్యష్టి భావన లేదు. తాను నమ్మిన దేవుడే తనకి సర్వస్వం అని స్థిరమైన భావన కలిగి వున్నాడు. అక్కడ తాను వేరు, స్వామి వేరు' అనే భావనే లేదు. ఉన్నది స్వామి ఒక్కడే అని సంపూర్ణంగా విశ్వసించాడు కనుకనే అలా చేయగలిగాడు. అక్కడ 'దేహం తాను' అనే భావన కించిత్తు కూడా లేదు. "ఈశావాస్య మిదగ్ం సర్వమ్ యత్కించ జగత్యాం జగత్" అన్న ఉపనిషత్ వాక్యాన్ని సంపూర్ణంగా "యత్కించ జగత్యాం జగత్" అన్న ఉపనిషత్ వాక్యాన్ని సంపూర్ణంగా తన ఆచరణలో చూపెట్టాడు కన్నప్ప.



ఈ సర్వము ఈశ్వరుడితోనే నిండివుంది. అట్టి ఈశ్వరుడికి వనచరుడు తన పాదుకని పశుపతి యొక్క నేత్రాంగం దగ్గర పెట్టాడు. ఆయన పుక్కిట పట్టిన నీటితో దివ్యాభిషేకం చేశాడు. "స్వామికి యిది పెట్టవచ్చా? పెట్టకూడదా?" అని తిన్నడు ఆలోచించలేదు. తాను ఏది తింటాడో దానినే స్వామికి నివేదన చేశాడు.

ఆనాడు మరి గుప్పెడు అటుకులు మూటకట్టుకుని వెళ్ళిన కుచేలుడిని అనుగ్రహించలేదా కృష్ణపరమాత్మ? అజ్ఞాన దారిద్ర్యాన్నే పోగొట్టే పరంధాముడికి ఇహలోక దరిద్రం గురించి ఎందుకు చెప్పాలి అని అనుకునేవాడు ఆయన. కాని సంసార భారం మోయలేక, భార్యమాటనీ, యింటిపోరునీ పడలేక కృష్ణుడి దగ్గరకు వెడతాడు కుచేలుడు. ద్వారక వెళ్ళేసరికి, ద్వారపాలకులు ఆయన్ని అడ్డగిస్తారు. ఆయన 'కృష్ణా!' అని మనసులోనే తలచేసరికి కృష్ణుడి ఒడిలోనే ఉన్నాడు. కృష్ణుడు ఎక్కడో లేడు. మన స్మరణలోనే ఉన్నాడు. ఆతృతతో, ఆవేదనతో, ఆర్తితో పిలవాలేగాని, స్మరణమాత్రం చేత మరణాన్నే దూరం చేసి, ఆనందాన్ని ప్రసాదించేవాడు కృష్ణుడు.

గజేంద్రుడు పిలిచేసరికి రాలేదా? దేవుడిని మనసారా పిలవడం నేర్చుకోవాలి. అణువణువులోనూ భగవంతుడు నిండి ఉన్నాడు. కనుక ఆయన లేనిచోటూ లేదు, వినని పిలుపూ లేదు. కానీ మధ్యలో మన మనసు చేరి మనని మనమే దూరం చేసుకుంటున్నాము. ఆ మనస్సునే భగవంతుడి యందు ఉంచితే ఆయన మన పిలుపులోనే ఉన్నాడు. ఎదుటివాడు విస్తట్లోది చూస్తే అది బావుంది, ఇది బావుంది అనుకుంటూ, ఈర్ష్యాసూయలకి లోబడి తమ విస్తట్లో ఉన్నదానిని కుళ్ళ బెట్టుకుంటున్నారు మానవులు.

ఇక్కడ మన కుచేలుడిలో అటువంటి నీచభావాలు ఏవీ లేవు. మనసు నిండా కృష్ణుడినే నింపుకున్నవాడికి యితరమైన భావన వచ్చి చేరడానికి చోటేది! అందుకనే తలచినంతనే తలంపాలు వచ్చి, కృష్ణుడు తన అష్ట భార్యలతో సహా కుచేలుడికి పూజ చేశాడు. తన భక్తుడి పాదాలు కడిగాడు కృష్ణుడు. "నీకు నువ్వే చేసుకుంటున్నావయ్యా" అని సిగ్గుతో ఆనందించేస్తున్నాడు కుచేలుడు. ఆయనకి చిన్నప్పటి నుంచీ కృష్ణయ్య తప్ప రెండోది తెలియదు. అంత ఆరూఢంగా తెలుసుకుని ఉన్నాడు కనుకనే పాదాలు కడిగేవాడు, కడిగించుకుంటున్నవాడు కూడా కృష్ణుడే అని గుర్తించి ఆనందంలో ఓలలాడాడు కుచేలుడు. అందుకనే ఆ కుచేలుడి కొంగు ముడులన్నీ తానే విప్పి అటుకులని తీసుకుని ఆరగించాడు కృష్ణయ్య. భగవంతుడిని పరిపూర్ణంగా విశ్వసిస్తే మనని పట్టి బంధించే ముడులన్నీ ఆయనే విప్పి మనకి బంధ విముక్తిని ప్రసాదిస్తాడు. ఆ అటుకులని ఎంతో ఆనందంగా ఆరగించాడు ప్రభువు. రెండు గుప్పిళ్ళు తినేసరికి కుచేలుడికి సకల దరిద్రాలు తీరిపోయాయి. కృష్ణుడు మూడో గుప్పిడు తినబోతూ వుంటే, రుక్మిణమ్మ ఆపేసింది! అదికూడా ఆరగిస్తే యిక తామందరూ వెళ్ళి కుచేలుడింట్లో దాస్యం చేయాల్సివస్తుందని భయమేమో ఆ యమ్మకి!

మన మనస్సెరిగి, మనమెలా వున్నా ఫరవాలేదనుకొని, మనమిచ్చినది ఆరగించి, మనని తన మదిలో దాచుకునేవాడు దేవుడు. ఆయన బాహ్యాడంబరాలని చూడడు. గురుమహరాజ్‌వారి దగ్గరికి భక్తురాలు ఒక చిన్న పకోడి పొట్లం పట్టుకుని వచ్చి, ఎంతో సిగ్గుపడుతూ ఇవి స్వామికి ఎలా యివ్వనా అని ఒక మూల నిల్చుని ఉంది. స్వామి తమంతట తామే ఆమె వద్దకు వెళ్ళి, ఆ పొట్లం తీసుకుని తాము ఒక పకోడీ నోట్లో వేసుకుని, ఆ మహాప్రసాదాన్ని అందరికీ పంచి పెట్టారు! అవి దారమ్మట బండిలో పెట్టుకుని అమ్మే పకోడీలే అవచ్చు కాని స్వామికి పదార్థ భావన ఉంటే కదా! ఆయన చూసేది కేవలం భక్తి భావన మాత్రమే.

మహాత్ముల సమకాలికులై, వారిని సేవించుకుని తరించిన భక్తులు ఈనాటికీ ప్రకాశిస్తున్నారు. శివాజీ మహారాజు సమర్థ రామదాసస్వామిని, రాణీ రాసమణి శ్రీరామకృష్ణ పరమహంసవారిని, శరభోజి మహారాజు త్యాగరాజ స్వామిని సేవించి తమ జన్మలని సార్థకం చేసుకున్నారు.

శ్రీరామకృష్ణులు జగజ్జనని కాళీమాతని సేవిస్తున్న సమయంలో ఆ ఆలయం కట్టించిన రాణి రాసమణీ దేవి అక్కడే కూర్చుని వుందిట. ఇంతలో రామకృష్ణులు సడెన్‌గా వెనక్కి తిరిగి ఆమె చెంపమీద గట్టిగా కొట్టి, "ఇక్కడ కూడా కోర్టు విషయాలే ఆలోచించాలా?" అని మందలించారు. అక్కడ వున్నవారందరూ దిగ్భ్రాంతులవుతారు. కానీ రాణి మట్టుకు గురుమూర్తి చేసిన చర్యని అర్థం చేసుకుని, ఆయనని ఎవరూ

ఏమీ చేయరాదని శాసిస్తుంది. చూశారా! మహాత్ములు మన మనసు నెరిగి దానిపైన ముద్ర వేస్తారు. ఏ కొంచెం చెడు భావన వున్నా నశించిపోతామని మన మనసుల్లోని మూలమూలలా వారు చూస్తూనే వుంటారన్న దానికి ఇదే నిదర్శనం.

శివాజీ మహారాజు తన సమస్త రాజ్యాన్నీ సమర్థులవారికి అర్పించాడు. కానీ గురుదేవుని ఆజ్ఞ మేరకు, గురుపాదుకలని సింహాసనంపై వుంచి, గురుదేవుని ప్రతినిధిగా మాత్రమే రాజ్యపాలన చేశాడు. భరతుడు కూడా ఆ విధంగానే చేశాడు కదా! భరతుడు నడచిన బాటలోనే నడిచాడు శివాజీ మహారాజు. మనందరం కూడా భరతుళ్ళయిపోవాలి. రాముడి ప్రక్కనే వుండి సేవచేసుకున్న లక్ష్మణుడి కంటే గొప్పవాడయిపోయాడు భరతుడు. త్యాగానికి చిహ్నమైన కాషాయం రంగు పతాకాన్ని ఎగరేశారు ఆ మహాభక్తులు.

మనసు కాషాయాన్ని ధరించాలి. దానిని నిరంతరం సత్సంగంలో ఊరవేసి వుంచాలి. మహాత్ములందరూ మనకి వెలలేనటువంటి రత్నాలని పారబోసి వెళ్ళారు. వాటిని ఏరుకోవడం మనకి చేతకావటం లేదు. ఈ క్షణం నుంచే ఏరుకోండి. మనతో వచ్చేది ఏదీలేదు. భగవంతుడొక్కడే మన సొంత ప్రాపర్టీ (ఆస్తి). ప్రతి సంకల్పాన్నీ భగవత్ సంకల్పం చేసుకోండి. "భగవంతుడు నావాడు" అని గుర్తించండి. ఆ గుర్తింపు వుంటేనే గురుదర్శనం అవుతుంది. భక్తుల చరిత్రలు వినడం చాలా ముఖ్యం. వినడం వలన, వారెలా జీవనం గడిపారో, సమస్యలని ఎలా ఎదుర్కున్నారో, భగవంతుడిని ఏవిధంగా సేవించారో మనకి తెలుస్తుంది. వారు నడచిన బాటని ఆశ్రయిస్తే వారు పొందిన ఆనందం మనమూ పొందగలుగుతాం. భక్తికి అసాధ్యమైనది ఏదీలేదు. కనుక అటువంటి అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యములను ప్రసాదించి గురుపాదుకలు సర్వదా కాపాడుగాక! సుఖీభవ! సుఖీభవ!



షడంగాది వేదో ముఖేశాస్త్ర విద్యా
గృహం బాంధవాః సర్వమేతద్ధి జాతమ్
గురోరంఘ్రి పద్మే మనశ్చేన్నలగ్నం
తతఃకిమ్ తతఃకిమ్ తతఃకిమ్ తతఃకిమ్ ॥

# సన్నిధిలో సంభాషణ

– పరాశర ప్రసాద్

23.6.85

ఈ రోజు రాత్రి శ్రీబాబు దర్శనార్థం శ్రీరావుగారు ఆయన భార్య వచ్చారు. వారు నమస్కారం చేసుకుంటుండగా శ్రీబాబు వారిరువురికి పూలదండ వేసి 'మీరు ఇద్దరు చక్కగా ఆదర్శ దంపతులుగా ప్రకాశించాల'ని ఆశీర్వదించారు. శ్రీరావుగారు మాట్లాడుతూ 'మేము ఆదర్శదంపతులము కాము. మాఆవిడ నన్ను తాను ఆడించినట్లు ఆడమంటుంది గాని మీరు ఆడమన్నట్లు ఆడితే ఒప్పకోదు' అన్నారు. రావుగారు ఇంకా మాట్లాడుతూ 'బాబూ! ఒక చిన్న సంఘటన చెప్తాను' అన్నారు. శ్రీబాబు "సరే చెప్పండి" అన్నారు.



'ఈమధ్య ఒక జ్యోతిష్కుడు మాఇంటికి వచ్చాడు. అతనికి మీ ఫోటో చూపించి మీహస్త రేఖలు చూడమని చెప్పాను. మీ గురించిన వివరాలు అతనికి నేను తెలియజేయలేదు. కాని ఆ వ్యక్తి మీ హస్త రేఖలు చూసి 'ఇవి సామాన్య మానవుడి రేఖలు కాదు. నేను భగవంతుడిని దర్శించలేదు కాబట్టి ఇవి భగవంతుడివి అని అంటే మీరునమ్మరు. ఈయన సామాన్య మానవుడుకాదు. ఎవరో మహాత్ములు. ఇంతవరకు అటువంటి రేఖలు గల వ్యక్తిని చూడలేదు అని అన్నారు' అని చెప్పారు.

శ్రీబాబు మాట్లాడుతూ "అంత వరకు బాగానే ఉంది. దానివలన మీరు గ్రహించినది ఏమిటి? మీరు పొందినది ఏమిటి? ఈ విషయాన్ని మీరు ఇంకెవరికైనా తెలియజేస్తే మీమాట నమ్మవద్దండీ?" అన్నారు. రావుగారు మాట్లాడుతూ 'మీరు మాపైన మాయనికమ్మిస్తారు. లేకపోతే ఎవరైనా నమ్ముతారు. కాని నాపైన మాత్రం మాయని కమ్మింపజేయలేరు అన్నారు.

శ్రీబాబు మాట్లాడుతూ మిమ్మల్ని మాయ కమ్మదా ? సరే అయితే మీరంతా ఈ విషయం గుర్తుంచుకోండి. కొద్దిక్షణాల్లో ఈయన మాయలో పడతాడో లేదో మీరే చూస్తారుగా. నారదుడు అంతటివాడికి తప్పలేదు" అన్నారు.

శ్రీబాబు అజ్ఞానుసారం సంకీర్తన చేశారు 'గురుదేవా జయదేవా శరణుశరణు సద్గురుదేవా' అన్న కీర్తన పాడుతుండగా శ్రీబాబు మాట్లాడుతూ "గురుదేవుడు సర్వరక్షకుడు కరుణామయుడు, సకలభోగ భాగ్యాలను అందజేసేవాడు. కాంతిని అందజేసేవాడు, నీలోని రజోతమో గుణాలను సుగుణాలుగా మార్చేవాడు.

గురులక్ష్యార్థము అంత్యకాలంలో మనస్సును అయన యందే నిలుపుతుంది. గురులక్ష్యార్థానికి ఎంత శక్తి ఉందో మీరు ఊహించగలరా?" అన్నారు శ్రీబాబు. ఇంతలో శ్రీబాబు దర్శనార్థం ఆశ్రమం నుండి దంపతులు విచ్చేశారు.

శ్రీబాబు వారిని చూసి "పాపం నిన్న అనగా బయలుదేరారు. ఆశ్రమంలోనే లఘుపూజ చేసుకుని స్వామికి నివేదన చేసుకుని ఈరోజు రాగలిగారు. మరి మాకేమి తెచ్చారండి?" అని ప్రశ్నించి, "పిచ్చివాళ్ళలారా అక్కడ స్వామికి సమర్పిస్తే అది నాకు చెందదా?" అని అనేసరికి ఒక భక్తుడు పెద్ద పళ్ళెంలో స్వీట్లు తీసుకువచ్చాడు.

శ్రీబాబు మాట్లాడుతూ 'ఆ స్వీట్సు మీద ఉన్న దృష్టి భగవంతునిపై ఉంటే ఎంత బాగుంటుందయ్యా?" అన్నారు. శ్రీరావుగారు మాట్లాడుతూ 'ఎంతైనా ప్రసాదం కదండీ. ప్రసాదం అంటే గురుకృప, దయ, కటాక్షము' అన్నారు. శ్రీబాబు మాట్లాడుతూ "మనస్సు నిలిచినపుడు అది ప్రసాదం అవుతుంది. లేకపోతే అది మనసుకి, జిహ్వకి రుచిని అందజేసే పదార్థమే కదా" అన్నారు. అనంతపద్మనాభశాస్త్రి ప్రసాదాన్ని గూర్చిన పద్యము చదివాడు.

శ్రీబాబు మాట్లాడుతూ ''నువ్వు చెప్పింది శాస్త్ర ప్రమాణమే గాని అనుభవంకాదుగా? అయినా మీరంతా పండితులు చదువుకున్న వారు. మీముందు నేనెంత? హనుమంతుడి ముందు కుప్పిగంతులు వేసినట్లు. ఏమంటారు రావుగారూ?" అన్నారు. రావుగారు మాట్లాడుతూ 'నన్ను హనుమంతుడిని చేశారు చాలు' అన్నారు. శ్రీబాబు ప్రసాద రావుగారిని పాటపాడమని రావుగారిని నృత్యం చేయమని ఎలా నృత్యం చేయాలో అభినయించి చెప్పారు. ఇంతలో డాక్టరు రాజుగారు లేచినుంచున్నారు.

శ్రీబాబు మాట్లాడుతూ 'ఏమిటి డాక్టరు? నువ్వు నృత్యం చేస్తావా లేక మీరు డాన్స్ చేయకపోతే కొలస్టరాల్ పెరుగుతుందని చెప్పటానికి నిలుచున్నవా? అన్నారు. ఇంకా మాట్లాడుతూ "రావుగారు నృత్యం చేద్దామనే పాంటు వేసుకుని వచ్చారు" అన్నారు. రావుగారు మాట్లాడుతూ 'మీరు ఆశ్రమంలో లేనప్పడు నేను ఈ డ్రెస్‌తోనే డ్యాన్సు చేసేవాడిని బాబూ' అన్నారు.

శ్రీబాబు మాట్లాడుతూ "ఏమిటండీ నేను లేకపోవటమేమిటి ? మీరు ఇప్పుడే అన్నారు నన్ను మాయ అవరించదని. మరి దీనిని ఏమంటారండీ రావుగారూ?" అన్నారు. రావుగారు మాట్లాడుతూ, గెలుపు ఎప్పుడూ మీదే అయినా మేము ఓడితేనేగా మీరు గెలుపొందేది' అన్నారు. శ్రీబాబు మాట్లాడుతూ "పోనీ అలాగే అనుకోండి. కాని దీపానికి దీపకాంతికి తేడాలేదు. దానిని గ్రహించండి చాలు" అన్నారు.

*

# శ్రీకాళీగార్డెన్స్‌లో కార్యక్రమాలు

**జనవరి 2013**

1 మంగ  ఇంగ్లీషు సంవత్సరాది, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

7 సోమ గురుదశమి, సత్సంగం శ్రీ సద్గురు పాదపూజ

10 గురు  మాసశివరాత్రి

13 ఆది  భోగి పండుగ, శ్రీ సద్గురు పాద పూజ, సత్సంగం, భక్త సమారాధన. రాత్రి 8 గంటలకు శ్రీసద్గురుదేవులకు భోగి పళ్ళు పోయుట.

14 సోమ మకర సంక్రాంతి, (ఉత్తరాయణ పుణ్యకాలం),   శ్రీ సద్గురు పాదపూజ సత్సంగం, భక్త సమారాధన.

15 మంగ కనుమ

26 శని రిపబ్లిక్ డే, పూర్ణిమ, శ్రీ సద్గురు పాదపూజ

ఫిబ్రవరి 2013

5 మంగ శ్రీ గురు దశమి, సత్సంగం,  శ్రీ సద్గురు పాదపూజ

8 శుక్ర  మాసశివరాత్రి

17 ఆది  రధ సప్తమి

21 గురు భీష్మ ఏకాదశి, శ్రీ సద్గురు పాద పూజ, సత్సంగం. పెదనింద్రకొలను శాఖలో శ్రీ సద్గురు దేవుల దివ్య మంగళమూర్తి నవమ ప్రతిష్టా వార్షికోత్సవం. శ్రీ సద్గురుపాద పూజ, సత్సంగం, భక్తసమారాధన.

25 సోమ మాఘ పూర్ణిమ, శ్రీ సద్గురు పాద పూజ, సత్సంగం, భక్తసమారాధన.

## శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తులు, ఆశ్రమ స్థిరనివాసులు అయిన అలాసె రాధారాణిగారు 26-11-2012 సోమవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 69 సంవత్సరాలు. వీరికి ముగ్గురు కుమార్తెలు, అల్లుళ్ళు, మనుమలు, మనుమరాండ్రు కలరు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక!

వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# యోగవాశిష్ఠము

-సుషుమ్న ప్రసాద

## వైరాగ్య ప్రకరణము -

ఆదికవి శ్రీవాల్మీకి మహర్షి భరధ్వాజ మహర్షితో "ఓ భారధ్వాజా! నీవు వశిష్ఠ మహర్షి, శ్రీరామచంద్రమూర్తికి జ్ఞానప్రబోధము చేసిన పంథాపై మనసు ఏకాగ్రతగా లగ్నం చేసి, శ్రీరామచంద్రుడెలాయైతే తన సద్గురుమూర్తి చేసిన అమూల్యమైన జ్ఞానసందేశములతో ఆత్మసాక్షాత్కారమును పొందాడో, అలాగే నీవు కూడా జనన మరణములనే వలయము నుండి విముక్తిని పొందవలసినది" అని ఆదేశించాడు.



15సంవత్సరాల లేప్రాయములో ప్రాపంచిక విషయాదులపై సంపూర్ణ విముఖత, విరక్తి కలగటమనేది చాలా విచిత్రమైన విషయం. శ్రీరామచంద్రుడప్పుడే నూనూగు మీసాలతో, నూత్న యవ్వనములో అడుగిడ బోతున్నాడు. ఆ లేత వయస్సులో సాధారణంగా అందరికీ జీవితం ఒక అందాల హరివిల్లుగా కనబడుతుంది. విద్యాసముపార్జనలో, క్రీడలలో రాణిస్తూ, ఆనందిస్తూ, బాధ్యతారహితంగా, ముద్దుముద్దుగా గడిపే ముచ్చటైన వయస్సు.

అందులో శ్రీరామచంద్రప్రభువు దశరథ మహారాజుకు ముదుసలి వయస్సులో లేకలేక కలిగిన, అపూర్వ పుత్రరత్నము. సంపదలకు, వైభవానికి పుట్టి నిలయమైన అయోధ్యానగరంలో దశరథ మహారాజుకు యాగఫలంగా లభించిన వరాలపంట. ముత్యాలమూట. రతనాలరాశి శ్రీరామచంద్రుడు. ముగురమ్మల ముద్దుల తనయుడు. తన ఆజ్ఞను శిరసావహించి, తన అడుగుజాడలలో నడిచే ముచ్చటగా ముపృరనుజులు భరత, లక్ష్మణ, శత్రుఘ్నులు తన కనుసన్నలకై పడిగాపులు కాస్తూ పరిచర్యలు చేసే దాసదాసీ జనము. అలాంటి వైభవోపేతమైన వైకుంఠవాసి, అయోధ్యసామ్రాజ్యానికి ఉత్తరాధికారియైన అందాల బాలరామునకు వైరాగ్యమంటే నిర్హేతుకమైనదేకదా!

గీతా ప్రబోధ సమయంలో అర్జునుని విరాగమునకు పరిస్థితులు వేరు. అర్జునుడు అప్పటి జీవితంలో ఎన్నో ఆటుపోటులను, ఒడుదుడుకులను ఎదుర్కొన్న పరిణత వయస్కుడు. కురుక్షేత్ర సంగ్రామ ప్రారంభమందు తన రథమును ఉభయపక్షాల మధ్య నిలిపి, ప్రతిపక్ష సైన్యాన్ని చూసి, వారంత తన బంధువులు, రక్తసంచలధీకులనే భావనతో వ్యామోహమునకు బానిసయై, విషాదమునకులోనైనాడు.

కాని శ్రీరామచంద్రుని వైరాగ్యము యిందుకు పూర్తిగా భిన్నమైనది. లోకరక్షకుడైన శ్రీరామచంద్రుని వైరాగ్యము సహజవైరాగ్యము. మానవాళిని

ముక్తిపథంలో నడిపి, తరింపజేయటానికి శ్రీరామచంద్రప్రభువు వైరాగ్యసంపన్నుడైనాడు.

శ్రీరామచంద్ర ప్రభువు సంపూర్ణవైరాగ్యముతో తన తండ్రిగారైన దశరథ మహారాజుగారి అనుజ్ఞతో, తన గురుమూర్తి అనుజ్ఞతో పవిత్ర క్షేత్ర దర్శనమునకు, తీర్థయాత్రకు వెళ్ళాడు. అన్ని పవిత్రక్షేత్రాలను దర్శించి తిరిగి అయోధ్యకు తిరిగి వచ్చాడు. 15సంవత్సరాల వయుస్సులోనే అతని శరీరం క్షీణించటం ప్రారంభమైంది. సౌందర్యానికి నిర్వచనమైన శ్రీరాముని ముఖారవిందము పాలిపోయింది. పద్మాసనం వేసుకుని, దీర్ఘాలోచనలో నిమగ్నమైపోయి, నిశ్శబ్దంగా, కదలిక లేకుండా ఉండిపోయాడు.తన దైనందిక చర్యలు నిర్వహించటానికి కూడా నిరాసక్తుడయ్యాడు. దశరథమహారాజు తన కుమారుని పరధ్యానమునకు, విషాదమునకు కారణమేమని పదేపదే అడిగాడు. కాని శ్రీరామచంద్రుడు సమాధానం చెప్పలేదు.

అటువంటి తరుణంలో శ్రీవిశ్వామిత్ర మహర్షి దశరథమహారాజు దర్బారులో అడుగుపెట్టాడు. దశరథుడు వెంటనే మహదానందంతో విశ్వామిత్రమహర్షిని సాదరంతో ఆహ్వానించి, ఉతన్నతాసనమున కూర్చుండబెట్టి, 'మీరేమి కోరుకున్నా యివ్వటానికి సిద్ధంగా ఉన్నాను' అని విన్నవించుకున్నాడు. అప్పుడు విశ్వామిత్ర మహర్షి "నేనొక మహాయజ్ఞాన్ని తలపెట్టాను. దానికి రాక్షసులు విఘ్నములు కలుగజేస్తున్నారు. కనుక మీరు మీ జ్యేష్ఠ పుత్రుడైన రామచంద్రుని నా వెంట పంపితే, అతను ఆ భయంకర రాక్షసులను విధ్వంసం చేసి, యాగసంరక్షణ చేస్తాడు" అన్నారు.

– సశేషం

## ఎవడు సన్యాసి?

ఒకరాజుగారికి సన్యాసులంటే ఎంతో భక్తి. సంసారాన్ని త్యజించి, ముక్తి మార్గంలో పయనించే సన్యాసులు అందరికంటె గొప్పవారని ఆయన విశ్వాసం. అటువంటి సన్యాసులు భిక్షమెత్తుకుని తిరగటం ఆయనకు నచ్చలేదు. అందుచేత ఆయన మంత్రిని పిలిచి, "మన రాజ్యంలో ఉన్న సన్యాసులందరికీ, ఒక్కొక్కరికీ పదివేల వరహాల చొప్పున పంచిపెట్టండి" అన్నాడు.

దేశంలో సన్యాసులకు కొదవలేదు. అందరికీ తలా పదివేలూ యిస్తే ఖజానా ఖాళీయే! అయినా రాజుకు ఎదురు చెప్పలేక 'చిత్తం అలాగే!' అని మంత్రి వెళ్ళిపోయాడు. మర్నాడు రాజు సభలో "మీకిచ్చిన కార్యం నెరవేర్చారా?" అని అడిగాడు. 'క్షమించాలి మహారాజా! సన్యాసి అన్నవాడెవడూ నాకు కనిపించలేదు' అన్నాడు. రాజు ఆశ్చర్యపోయాడు!

'అవును ప్రభూ! నిజమైన సన్యాసి తుచ్ఛమైన ధనం స్వీకరించడు. ధనం స్వీకరించిన వాడెవడూ నిజమైన సన్యాసి కాజాలడు' అన్నాడు మంత్రి.

ః

# గురు కృపా హి కేవలమ్

– రమణ ప్రసాద్

శ్రీబాబు ధ్యానం గురించి బోధ చేస్తూ, "సాధకుడు ముందుగా జిహ్వా చాపల్యాన్ని జయించాలి. ఆ తరువాత వాచా చాపల్యాన్ని జయించాలి. అంటే సాధ్యమైనంత వరకూ మౌనంగా ఉండటానికి ప్రయత్నించాలి. అలా కాకపోతే భగవంతుణ్ణి గురించి మాత్రమే మాట్లాడాలి. అనవసర ప్రసంగాలు మానివేయాలి. దీని ద్వారా శబ్దం శుద్ధి చెందుతుంది. శబ్దం ద్వారా ఆకాశం, దాని ద్వారా వాయువు శుద్ధి చెందుతాయి. మితాహారం వలన ధ్యానం బాగా చేయగలుగుతావు.

ధ్యానం అంటే ఒక ఉదంతం గుర్తుకు వచ్చింది. ఒకసారి నేను చిరంజీవి, శేషగిరిరావు, ఇంకా మరికొంతమంది భక్తులు కలిసి పడవలో కొల్లేరులో ప్రయాణం చేస్తున్నాము. కొల్లేరు మధ్యలో ఉండగా పెద్దగాలి వచ్చి అకస్మాత్తుగా నీటి మట్టం పెరిగి పోయింది. మేమంతా ప్రమాదంలో చిక్కుకున్నాము. పడవ మునిగిపోయే పరిస్థితి వచ్చింది. అందరూ ఏడ్పులు మొదలు పెట్టారు. వారిలో కవి పరిమి సుబ్రహ్మణ్యంగారు కూడా ఉన్నారు.

వారందరినీ చూసి నాకు నవ్వు వచ్చింది. వీరందరికీ మరణమంటే ఎంత భయమో! వారికి వెంటనే చెప్పాను 'మీరేమీ భయపడవలసిన పని లేదు. మీరు మీ మీ స్థానాలలో కూర్చుని నా మీద విశ్వాసం ఉంచి కదలకుండా భగవంతుణ్ణి ధ్యానించండి' అన్నాను. వారందరూ అలాగే కళ్ళు మూసుకుని ధ్యానించారు. కొద్ది క్షణాలలో పడవ ఒడ్డుకు చేరింది. పడవ ఎంత టైమ్‌లో ఎలా ఒడ్డుకు చేరిందో ఎవరికీ తెలియదు.

'వారి ధ్యాన ఫలితం చూశారా! అదీ ధ్యానమంటే" అన్నారు శ్రీబాబు.

ఇటీవల కాలంలో యిటువంటి సంఘటన మరొకటి జరిగింది. శ్రీమాతాజీ కొంత మంది భక్తులతో కలిసి నేపాల్, కాశీ క్షేత్రాలకు బయలుదేరారు. వారిలో నేను కూడా ఉన్నాను. అది 20 రోజుల యాత్ర.

ముందుగా కలకత్తాకు చేరాము. నగరంలో విశేషాలు చూసి, రెండోరోజు నేపాల్‌కు బయలుదేరాము. నేపాల్ చేరాలంటే ఇండియా బోర్డరు రక్సౌల్‌లో దిగాలి. అక్కడ నుంచి బస్సు ప్రయాణం చేశాము.

నేపాల్ చేరాక పశుపతి నాధుని దర్శనం చేసుకుని అక్కడి సత్రంలో దిగాం. కాని అక్కడ వసతులు సరిగా లేకపోవటం వలన హొటల్ రూమ్ తీసుకుని అక్కడకు మారాము. ఆ రాత్రి కుమారి ఇందిర వారి పిన్నిగారు ఉన్న రూమ్‌లో దొంగలు పడి ఆవిడ పర్సు దొంగిలించారు. అందులో 11000 రూ॥లు ఉన్నాయి

అని వారు చెప్పారు. మేము పోలీసు రిపోర్టు యిచ్చాము. దొంగ దొరకలేదు. అక్కడ స్టేషన్ ఇన్‌చార్జ్ 'మీవి 11,000 రూ॥ పోయాయి. కాని పశుపతి నాధుని ఆలయంలో ఒకామెవి 60,000 రూ॥లు పోయాయి అన్నారు. ఆ తరువాత ఆ హొటల్ యజమాని ఆమె ఉన్న రూమ్‌కి ఛార్జ్ చెయ్యను. అంతకు మించి ఏమీ యిచ్చుకోలేనని చెప్పాడు. 'ఎక్కడికక్కడే వెంకట లక్ష్మి' అని శ్రీబాబు అనే మాట గుర్తుకు వచ్చింది. ఎందుకంటే పోయినది పదకొండువేలే కదా! అరవైవేలు కాదు కదా! అని.

ఆ మరునాడు పొద్దున్నే బయలుదేరి మాయాదేవి మందిరం దర్శనం చేసుకుని భోజనాలు చేసి నాగర్‌కోట్‌కి బయలుదేరాము. భోజనాలు అయ్యేటప్పటికి ఆలస్యం అయింది. సూర్యాస్థ సమయానికి మేమందరం రెండు బస్సులలో బయలుదేరాము. శ్రీమాతాజీ మాతో రాలేదు.

కొండచరియల పై నుంచి ప్రయాణం సాగుతోంది. ఇంతలో చీకటి పడింది. కన్ను పొడుచుకున్నా ఏమీ కనబడటం లేదు. రోడ్డు చూస్తే ఒక బస్సు మాత్రమే వెళ్ళేందుకు అనువుగా ఉంది. ఇంతలో కొండపైనుంచి బస్సు రావటంతో, మా బస్సులు కొండ చివరిగా తప్పుకోవలసి వచ్చింది.

బస్సు డ్రైవర్లు అతి కష్టం మీద బస్సులు నియంత్రించటానికి ప్రయత్నిస్తున్నారు. ఏ మాత్రం స్టీరింగ్ పట్టు తప్పినా లోయలో పడటం ఖాయం. కొండ చరియ చివరిగా వెళ్తూ ఉంటే, టైర్లు కిర్ కిర్ర్ అని శబ్దం చేస్తూ ఉంటే, అక్కడి రాళ్ళన్నీ లోయలోకి పడుతున్నాయి. మా అందరికి గుండె ఝల్లు మంటోంది.

డా॥స్వర్ణ 'సద్గురు దేవుల నామాన్ని అందరూ బిగ్గరగా అనండి. వేరే విషయాన్ని మనస్సులోకి రానివ్వకండి. శ్రీబాబునే మనస్సులో నిలుపుకోండి" అని అందరిచేత శ్రీసద్గురు నామం చేయించారు. అందరి మనసులూ సద్గురుదేవులపైనే నిలిచిపోయాయి. ఇంతలో మా బస్సులు ఎదురుగా వచ్చే బస్సుకు దారి యిస్తూ నాగర్‌కోట్ శిఖరానికి చేరుకున్నాయి. అక్కడ ఒక పాయింట్ నుంచి చూస్తే ఎవరెస్ట్ శిఖరం బాగా కనిపిస్తుంది.

ఎవరెస్ట్ శిఖరం చూసిన తరువాత అందరమూ బసకు చేరుకున్నాము. భక్తులందరూ యీ విషయాన్ని శ్రీమాతాజీకి చెబుదామని వెళ్ళాము. ఆవిడ మేము బస్సు ఎక్కిన దగ్గర నుంచి తిరిగి వచ్చే వరకు ధ్యానంలో ఉన్నారని తెలిసింది.

'అదీ ధ్యాన ఫలితమంటే' అని శ్రీమాతాజీవారు అన్నారు. వారు మాకందరికీ అటువంటి దివ్యానుభూతిని, రక్షణను కలుగజేశారు.

*

# ఆహ్వానము

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమము హైద్రాబాద్‌శాఖ

సత్సంగ సమావేశాలు

## శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీవర ప్రసాద బాబూజీ మహరాజ్‌వారి దివ్య ఆశీస్సులతో

*శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమాధిపతి పూజ్యయోగిని శ్రీచంద్ర కాళీప్రసాదమాతాజీవారి సత్సంగ సమావేశాలు*

*23-1-2013 బుధవారం నుండి 27-1-2013 ఆదివారం వరకు*

కార్యక్రమాలు -

ఉదయం 4గం.ల నుండి 6గం.ల వరకు సుప్రభాతం, ధ్యానం, ప్రార్థన.

ఉదయం 10గం.ల నుండి 12గం.ల వరకు సంకీర్తన, ఆధ్యాత్మిక ప్రవచనములు, శ్రీమాతాజీవారిచే తీర్థప్రసాదములు.

విశేష కార్యక్రమము -

27-1-2013 ఆదివారం ఉదయం 10గంల నుండి సామూహిక శ్రీసద్గురుపాదపూజ

స్థలం - ఇ.నెం. 10-2-409, ప్లాట్ నెం.221, రోడ్ నెం. 9, స్ట్రీట్ నెం.2, వెస్ట్ మారేడ్‌పల్లి, సికిందరాబాద్.

సాయంత్ర కార్యక్రమము -

23-1-2013 బుధవారం నుండి 26-1-2013 శనివారం వరకు సాయంత్రం 5గం.ల నుండి 6గం.ల వరకు సంకీర్తన, ప్రార్థన.

6గం.ల నుండి 8గం.ల వరకు పూజ్యశ్రీమాతాజీవారి సత్సంగ సమావేశములు.

స్థలము - ***మహబూబ్ కాలేజీ ఆడిటోరియం, సికింద్రాబాద్.***

వివరములకు -

| | |
|---|---|
| శ్రీ జి. జగదీశ్వర్ | 99856 66797 |
| డా॥విక్రమసింహారెడ్డి | 93466 84915 |
| శ్రీ యన్. సుబ్రహ్మణ్యం | 98499 68539 (కుట్టి) |
| శ్రీ సాంబయ్య | 99855 69994 |
| శ్రీ కాళీ ప్రసాద్ | 98660 74229 |

www.mathaji-babuji.org

# అహం బ్రహ్మాస్మి

– కొండ వెంకట్రాజు

(పార్థసారథిగారి ఆంగ్లరచన నుండి సేకరణ)

పూర్వం ఒకరాజుగారు, ఒకరాణిగారు, వారికి అందమైన యేడాది వయస్సు ఉన్న ఒక కుమారుడు ఉండేవారు. అప్పుడు ఆ దేశానికి జల ప్రళయం వచ్చింది. సగం రాజ్యమంతా నీళ్ళల్లో కొట్టుకుపోయింది. రాజు తన కుమారుణ్ణి రక్షించటానికి, తేలుతున్న ఒక చిన్నపెట్టెలో పెట్టి దేవుడిమీద భారం వేసి వదిలివేశాడు. చివరికి రాజు, రాణి కూడా ఆ ప్రళయంలో చనిపోయారు. చనిపోగా మిగిలిన ప్రజలు రాజ్యాన్ని పునః స్థాపించారు. కొంతమంది మంత్రులు బతికిబట్టకట్టారు. వారు రాజు రాణి కోసం వెతకగా వారి శవాలు దొరికాయి. రాజుకుమారుడి జాడమాత్రం తెలియలేదు. ఎంత కాలం వెతికినా ఏమీ ఫలితం కనబడలేదు. ఒక సంవత్సరం గడిచింది. మంత్రులే రాజ్యాన్ని రాజకుమారుడి తరపున పాలించటం మొదలుపెట్టారు. రాజుకుమారుడు ఎప్పటికైనా దొరకకపోతాడా అని ఆశ. అతని కుడి భుజం మీద పెద్ద పుట్టుమచ్చ ఉంది. అదే ఆధారం.

అదే దేశంలో ఒక ముష్టివాడు 14 సంవత్సరాల నుండి ఒక నగరంలోని మార్కెట్ వీధుల్లో అడుక్కొంటూ జీవితం గుడుపుతున్నాడు. వాడికి ప్రపంచం నుండి ప్రేమ తక్కువగా, చీదరింపు, కష్టాలు మరింత ఎక్కువగా అందాయి. రెండుసార్లు రక్షకభటులు పట్టుకుని బెగ్గర్స్‌హెూమ్‌లో వేశారు. అక్కడి నుంచి తప్పించుకుని వచ్చి, తిరిగి అదే ప్రదేశంలో అడుక్కోవటం మొదలు పెట్టాడు. ఈ విధంగా వాడు అక్కడి వర్తకులకు బాగా తెలిసినవాడైనాడు. మూడోసారి కూడా రక్షక భటులు వాడిని పట్టుకోవటం జరిగింది. ఈసారి రక్షక వాహనం ఎక్కించి, తిన్నగా రాజమందిరానికి పంపారు. శిక్ష అక్కడే వేస్తారులే అని. మంత్రిమండలి వాడికి ఏమి శిక్ష విధించాలా! అని ఆలోచిస్తుంటే, ఇంతలో వాళ్ళు వాడి భుజం మీద పెద్ద పుట్టుమచ్చ గమనించారు. అంతేవాళ్ళు తప్పిపోయిన తమ రాజకుమారుడిని గుర్తించారు. అతనిని రాజనగరం అంతా ఊరేగించి, రాజ సింహాసనం మీద కూర్చోబెట్టి, తమ మీద ఉన్న రాజ్యపాలన భారాన్ని అతనికి ఒప్పచెప్పారు.

ఒక సంవత్సరం కష్టపడి రాచరికం నేర్చుకుని మంచి రాజు అని పేరు తెచ్చుకున్నాడు. తరువాత తన పూర్వ జీవితం ఎలా ఉంటుందో చూద్దామని మళ్ళీ అదే భిక్షగాడి అవతారం ఎత్తి, అదే నగరానికి వెళ్ళి అదే కూడలిలో అడుక్కోవటం మొదలు పెట్టాడు. అక్కడి వర్తకులు అందరూ యిన్నాళ్ళూ ఎక్కడికి వెళ్ళావు? అని పరామర్శించారు. మళ్ళీ అతనికి పూర్వంలాగే మిథ్యా ప్రపంచం నుండి ప్రేమ తక్కువగా, చీదరింపు, కష్టాలు మరింత ఎక్కువగా అందాయి. కాని ఇప్పుడు ఆ ప్రపంచం అతన్ని పూర్వంలాగ ఏమీ భయపెట్టలేక పోయింది. ఎందుకని??

పూర్వం అతడు జ్ఞానం లేనివాడు. ఇప్పుడు జ్ఞానవంతుడు అయ్యాడు. పూర్వం కూడా అతడు రాజే. రాచరక్తమే అతనిలో ఉంది. కాని అతనికి తాను రాజుననే జ్ఞానం లేదు. ఇప్పుడు తాను రాజునని అతనికి తెలిసింది. గురువులు ఏమి చెబుతున్నారు? నీవూ, పరమాత్మా ఒక్కటే వస్తువు. నీవు కూడా ఆ బ్రహ్మవే అని గ్రహించు. స్వప్న ప్రపంచం ఎలాంటిదో, ఈ మిథ్యా ప్రపంచం కూడా అలాంటిదే అంటున్నారు. మనం అది పట్టించుకోవటం లేదు.

మనం ఈ కథలోని విశేషార్థానికి వద్దాం. బిచ్చగాడికి రాజస్థితి అనేది కొత్తగా వచ్చింది. మొదటి స్థితిలో ప్రపంచం అతన్ని బాగా యిబ్బంది పెట్టింది. రెండవ స్థితిలో అదే ప్రపంచం అతన్ని ఏమీ చేయలేకపోయింది. అతడు స్వతహాగా రాజే (బ్రహ్మమే). కాని అది అతనికి తెలియదు. రెండవ స్థితిలో నేను రాజుని (బ్రహ్మని) అనే జ్ఞానం వచ్చింది. అందుకే మిథ్యా ప్రపంచం అతన్ని భయపెట్టలేక పోయింది.

అలాగే నీవు బ్రహ్మగా పరిణతి సంపాదిస్తే, ఈ ప్రపంచ వాసనలు, ఈర్ష్య, అసూయలు, సుఖదుఃఖాలు నిన్ను ఏమీ అంటవు. నీవు కూడా భగవంతుని వలె ఒక సాక్షిగా మిగిలిపోతావు. మనం యిక్కడ ఒక ఉదంతం చెప్పుకోవాలి. ఒక చాకలివాడున్నాడు. వాడికి ఒక గాడిద ఉంది. అది ఇంటిదగ్గర నుంచి చాకిరేవుకి, తిరిగి అక్కడి నుంచి యింటికి బట్టల మూటలు మోస్తూ ఉంటుంది. దాని మెడకి ఒక తాడు వేసి, చాకలి దాని వెంటే ఉంటాడు. అది ఎక్కడికీ పారిపోకుండా రెండవ కొస చాకలి తన చేతిలోనే పట్టుకుంటాడు. చాకలి అనుకుంటాడు 'తాడు నా చేతిలోనే ఉంది కదా యిక గాడిద తప్పించుకుని ఎక్కడికీ పోలేదు కదా' అని. కాని గాడిద అనుకుంటుందిట 'చాకలి తాడు వదలనంతకాలం వాడు నా చుట్టూ తిరగ వలసినదే కదా! ఇప్పుడు వాడు గొప్పా? నేను గొప్పా??' అని.

ఇంతకీ ఎవరు ఎవరిని పట్టుకున్నారు?? లోక విషయవాంఛలు కూడా అంతే. ప్రలోభపెడతాయి. ఆ ప్రలోభాలని వదులుకోవటం అనేది. మన చేతిలోనే ఉంది. అది చెప్పుకోవటం వరకే కాని, ఆచరణలో పెట్టలేము. మాయ అంత పెనుభూతం. గురువు అనే భూతవైద్యుడే దాన్ని వదిలించగలడు. ఎన్ని మెట్లు ఎక్కాలో?? సగం మెట్లైనా ఎక్కగలుగుతామా?? మనం ఆ ప్రయత్నం చేస్తున్నామా?? నేను ఎంత వరకు జీర్ణించుకున్నాను?? అన్నీ ప్రశ్నలే!!



సర్వసుగంధ సులేపిత లింగం
బుద్ధి వివర్ధన కారణ లింగం
సిద్ధ సురాసుర వందిత లింగం
తత్ప్రణమామి సదాశివలింగం

# శ్రీకృష్ణ కర్ణామృతం

- సుశీలా ప్రసాద

"ఓయమ్మో! లీలమ్మా! మీ గోవుని కూడా తోలుకుపోతున్నాడు చూడు!" వెంకన్న వెనుకనుంచి అరిచాడు. తిరిగి చూశాను. వెళ్ళేవాడల్లా ఆగి నా వంక తేరిపార చూస్తూ వింతగా "ఇవాళ ఏమిటి కొత్తగా ఉన్నావు? నీ మెడలో మెరుస్తోంది ఏమిటంటావు?" అన్నాడు వింతగా. భోషాణంలో అడుగున పడేసిన ముత్యాల దండ ఇవాళ కనిపిస్తే మెడలో వేసుకున్నాను" అది వేలితో చూపిస్తూ."అది సరేగానీ! ఆ దండ మా గోవు కొమ్ములకి చుడితే ఎలా ఉంటుందంటావు?" అన్నాడు అమాయకంగా.



నేను నవ్వాను. "ఓరి పిచ్చి సన్నాసీ! మనుష్యులు వేసుకునే ముత్యాల దండలు పశువులుకి వేస్తారా? నీ మొహంలా ఉంది వెళ్ళు" అన్నాను. వాడు అంగుళం కూడా కదలకుండా నిలబడ్డచోటే నిలిచి "నిజంగా లీలమ్మా! చాలా బాగుంటుంది. ఒకసారంటే ఒకసారి. నా గోవు ఎంతందంగా ఉంటుందంటే" అని బ్రతిమిలాడటం మొదలు పెట్టాడు. "అబ్బే, దీని విలువ ఆ పశువుకేమి తెలుస్తుందిరా. పాడు చేస్తుందిగానీ" అని చెప్పినా వినకపోతే నాకు విసుగు, కోపం వచ్చాయి. "చూడూ! మీ నేస్తం నాయకుడు కిష్టయ్య ఉన్నాడో. వాడి మెడలో కూడా యిలాంటివి చాలా ఉన్నాయి కదా. పోయి వాడినే అడుగు" అన్నాను. "నిజమే నమ్మో! మంచిమాటే చెప్పావు. బాగుంది. కిష్టయ్యనే అడుగుతానుండు" అంటూ ఒక్క అంగలో బైటకి పోయాడు. వెర్రి కుదురుతుందిలే అనుకున్నాను.

పొద్దుగూకుతోంది. తోచకుండా ఉంటే రాధమ్మ దగ్గరకి వెళ్ళాను. ఇంట్లో ఓ మూలగా కూర్చుని ఉన్నది. ఏమిటో తనలో తనే అనుకుంటోంది. "వింటే ఈ పువ్వుల్లో, తీగెల్లో, ఆకాశము, భూమి అంతలో నాలో...." పిలవనా వద్దా అనుకుంటూ నిలబడ్డా. "నీలో కూడా" అని కళ్ళు తెరిచి "అంతా కృష్ణుడేనే లీలా!" అలా చూస్తున్నప్పుడు నాకు కలిగే ఆనందం నీ కెలా చెప్పగలను?" అని కూడా అంది.

ఆమె మాటలు అనుభవం లేని నాకు ఎలా అర్థమవుతాయి అనుకుంటూ పోయి ఆమె పక్కనే నిల్చున్నా. అంతలో వెంకన్న అక్కడకి పరుగెత్తుకు వచ్చాడు. "రాధమ్మా! నీ మెడలో ఉన్న ముత్యాలదండ తెమ్మన్నాడు కృష్ణుడు. ఇప్పుడంటే ఇప్పుడే. ఒక్క నిమిసం కూడా ఆలస్యం చేయకుండా ఇవ్వు. నేను వెంటనే వెళ్ళిపోవాలి" అని చేయి జాపుతూ తొందర చేస్తున్న వెంకన్న చేతిలో తన మెడలోని దండ తీసి పెట్టింది రాధమ్మ. వచ్చినంత వేగంగా వెళ్ళిపోయాడు వాడు. నాకు చిత్రమైంది. అడవులకి

పోతున్నప్పుడు వాడు నన్నడిగిన సంగతి రాధమ్మకు చెప్పాను. ఆ వెనుక కృష్ణుడు వచ్చినప్పుడు జరిగిన సంగతి కూడా చెప్పాను. "అన్నీ నీవే అన్నావుకదా! మరి ఆ దండ వెంకన్న అడిగినప్పుడు ఆ తెలివి ఏమయింది?" అంది మందలింపుగా. "అన్నాను గానీ, ఆ అడిగింది కృష్ణుడు కాదు కదా?" అన్నాను స్థిరంగా కూర్చుంటూ.

"అన్నీ నీవే అనటంలో అన్నిటా నీవే అన్న అర్థం కూడా నిండి ఉన్నదని, సర్వవ్యాపకుడైన వాడని గ్రహిస్తూ అడిగినవాడు కూడా కృష్ణుడే అని నీకు తోచలేదన్నమాట. వాడివస్తువు వాడికివ్వక దాచుకున్న నువ్వు దొంగవన్నమాట" గంభీరంగా అంటున్నది రాధమ్మ. "నేనింకా చిన్నదాన్నమ్మా" అజ్ఞానం నిండిన మనస్సు చిన్నబోతుండగా అన్నాను. తప్పుచేశానని నాకర్థమైందిప్పుడే. నాలో చీకటి ముసిరినట్లు బయట కూడా చీకట్లు కమ్మాయి. ఇంటికెడదామని లేస్తుంటే యశోదమ్మ పంపిన మనిషి వచ్చాడు. కృష్ణుడేమైనా వచ్చాడా అని యశోదమ్మ అడగిరమ్మన్నదంటూ. రాధమ్మ మెదలకుండా ఉంది. రాలేదన్నాను. పొద్దున్ననగా అడవికి పోయిన కృష్ణుడు, బలరాముడు, గోపాలురు, గోవులూ ఎవరూ యింతవరకూ తిరిగి రాలేదట. చీకటి దట్టమైంది. దీపాలు తీసుకుని వెళ్ళాలంటూ వాడు వెళ్ళిపోయాడు.

"చూస్తున్నావుగా లీలా! ఏ అద్భుత విలాసం చూపించ దలచుకున్నాడో నల్లనయ్య" అంది రాధమ్మ. "రాత్రయింది. పురుగు పుట్రా రాళ్ళూ రప్పలూ ఏమీ కనిపించవు కదా" అన్నాను కృష్ణుణ్ణి తలచుకుంటూ దిగులుగా. "కనీసం కాలికి చెప్పులు కూడా వేసుకోడు" అన్నాను. రాధమ్మ అంది వాళ్ళ నాన్న స్వయంగా దగ్గరుండి మెత్తగా ఉండే చెప్పులు కుట్టిస్తే అమ్మ నాన్న చూస్తున్నంత సేపూ వేసుకుంటాడు. ఆ పైన వాటిని తీసేస్తాడు. ఎందుకో తెలుసా! నేల మీద ఉండే అణువణువూ నా స్పర్శ కోసం పరితపిస్తుంటే ఆ తపనను నేను తీర్చవద్దా? ఈ చెప్పులు అందుకు అడ్డం వస్తాయి కదా! నేను వేసే ప్రతి అడుగుకి నేలతల్లి పులకించిపోతూ ఉంటుంది. దుమ్ముకణాలన్నీ ధన్యమైపోతాయి. రాళ్ళూ ముళ్ళూ అన్నీ మెత్తగా వెన్నలాగా కరిగిపోతాయి అన్నాడు" అంది రాధ. నిజంగా ఆవిడ మాటలూ, ప్రవర్తన అంతా వింటూ చూస్తూ ఉంటే కన్నయ్య దేవుడే అని దృఢమైపోతోంది. "ఉండు నేనూ వస్తాను నీతో" అంటోంది రాదమ్మ. తన మాటపూర్తికాకముందే వెంకన్న మా ముందున్నాడు. "మిమ్మల్ని కిట్టయ్య రమ్మంటున్నాడు!" త్వరగా నడిచి వచ్చినందున్న ఆయాసపడుతూ అన్నాడు మాతో. "ఎలా ఉన్నాడు? ఎక్కడ ఉన్నాడు?" అని అడగాలనుకున్న ప్రశ్నలు నాలోనే ఉండిపోయాయి. రాధమ్మ నా చేతిని పట్టుకుని త్వరత్వరగా ముందుకు నడిచింది. పల్లె వీధులన్నీ నడిచి అడివిలోకి దారితీసాడు వాడు. వాడి వెనుక మేము.

- సశేషం

# పరిప్రశ్నేన సేవయా

- పరాశర ప్రసాద్

'మాయ అంటే ఏమిటి? అది నిజంగా ఉన్నదా?' అన్న భక్తుని సందేహానికి సమాధానంగా శ్రీబాబు బోధ చేస్తూ "మాయ చాలా చిత్రమైనది. అది మానవుడికి భోగభాగ్యాలు, ధనధాన్యాలు నిత్యమని భ్రమింపజేస్తుంది. ఇంద్రియ సుఖాలే నిత్యమని భ్రమింపజేస్తుంది. అనిత్యమైన జగత్తు మీద వ్యామోహాన్ని కలిగింపజేస్తుంది. అంత ఎందుకు మీరు ఉదయం నిన్న నేను చేసిన బోధని విచారణ చేస్తూ తాబేలు తన పిల్లలకి సంకల్పం చేత ఆహారాన్ని అందిస్తుంది. అది చాలా బాగుంది. అది గురుదేవుని శక్తిని నిరూపించే ఉదాహరణ. ఇంతకీ నేను తాబేలు పిల్లనా కాదా?' అని సందేహించారు కదా. అదే మాయ అంటే.ఇంతకంటె ఏం వివరణ కావాలి మీకు?" అని సందేహం లేవనెత్తిన భక్తుని ఉద్దేశించి సద్గురుదేవులు మాట్లాడారు.



ఇంకా తమ బోధని శ్రీవారు కొనసాగిస్తూ, "కప్ప పాము నోటిలో చిక్కుకుని ఉన్నప్పటికీ పామునోటి నుండి విడిపించుకునే ప్రయత్నం చేయకపోగా నోటి దగ్గరకు వచ్చిన ఈగని పట్టటానికి ప్రయత్నిస్తుంది.అలాగే మానవుడు తన దగ్గర బంధువులెవరో మరణించినందుకు వారిని ఓదార్చటానికి ప్రయత్నిస్తాడు. కాని తనకి కూడా ఎన్నటికైనా తప్పదన్న విషయం మరచిపోతాడు. తాను శాశ్వతమని భావిస్తాడు. తన జీవిత గమ్యమేమిటో ఆలోచించడు. మహాత్ములు ఎంత బోధించినా దానిని పెడ చెవిని పెడతాడు. 'నేను తాబేలు పిల్లనా కాదా' అన్న సందేహం ఎందుకు కలిగింది? విశ్వాసంలో లోపమన్నమాట. నీటిలో పూర్తిగా మునిగినవానికి బుడబుడమని శబ్దం రాదు కదా. అందుబాటులో ఉన్న ఇంద్రియ సుఖాలు ఎందుకు త్యాగం చేయటం? వయస్సు మళ్ళిన తరువాత ఆత్మానందాన్ని గురించి ఆలోచించవచ్చులే అనేది అజ్ఞాన దృష్టి. మాయ పొంచి ఉండి ఎక్కడ బలహీనత ఉందో, ఎక్కడ గుణాలకి లొంగిపోయాడో అక్కడ పంజా దెబ్బ కొడుతుంది.

సద్గురుమూర్తిని ఆశ్రయించి లక్ష్యార్థ సాధన చేసే సాధకుణ్ణి మాయ ఎన్నడూ బాధించదు. ఆల్‌సేషియన్ కుక్క యజమాని చెప్పినట్లు వింటుంది. యజమాని సంరక్షణలో ఉన్నంతవరకూ మనకు ఏ రకమైన భయమూ లేదు. అలాగే సద్గురు సన్నిధిలో ఉన్నవానిని మాయ ఎన్నడూ ఆవరించదు. గురులక్ష్యార్థము మాయ నుండి రక్షించే ఛత్రము.

అసలు మాయను ప్రేరణ చేసేది మనస్సు. నీ మనస్సు సద్గురు మూర్తికి సమర్పించినట్లయితే మాయకు స్థానం లేదు. మీ మనస్సులో యింకొక ఆలోచన వచ్చింది. 'అందరిలో ఉన్నది భగవానుడే కదా! మనము మంచి చేసినా చెడు చేసినా ఆయనదే భారము' అని అనుకున్నారు కదా! సూర్యభగవానుడు నిష్పక్షపాతంగా కాంతిని అందరికీ అందజేస్తాడు. ఆ కాంతిలో సత్కార్యములు చేసేవారు కొందరు, దుష్కార్యములు చేసేవారు కొందరు. మరి ఆ తప్పు ఎవరిది? సూర్యభగవానుడిది కాదు కదా!" అన్నారు శ్రీబాబు.

*

# సత్సంగ మహిమ

– సుశీలా ప్రసాద

'స్వామీ! కుబేరులవారు తమ దర్శనం కోరుతున్నారు'. జయుని మాటలు వింటూ శ్రీమన్నారాయణుడు "రమ్మను" అన్నాడు. కుబేరుడు దీన వదనుడై వచ్చి, అంజలి ఘటించి నిలిచాడు. "నాయనా! ఏమన్నా ఆపద వచ్చిందా?" అన్నాడు లక్ష్మీపతి. "దేవదేవా! నా బిడ్డలుఇద్దరూ మహాధూర్తులై ఎవరినీ లెక్కచేయకుండా యిష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తున్నారు. శంకర కింకరులైనా వారు అవిధేయులై ఎంత లాలించి, బుజ్జగించి, బెదిరించి ఎన్ని విధాల చెప్తున్నా నా మాటలు వినటం లేదు. ఏం చెయ్యాలో తోచక తమ సన్నిధికి వచ్చి విన్నవించుకుంటున్నాను మీరే దిక్కు" గద్గద స్వరంతో ధనపతి చెప్పిన మాటలు వింటూ శ్రీహరి అరక్షణం ఆలోచించేలోగా అలవోకగా మహతీనాదం వినవచ్చింది. వెంటనే "సరే కుబేరా! వారి సంగతి నేను చూసుకుంటాను. నువ్వు నిశ్చింతగా ఉండు" అన్నాడు. పరమాత్మ యిచ్చిన వాగ్దానంతో తెప్పరిల్లిన కుబేరుడు తన తావుకు మరలిపోయాడు.

'తాతగారూ! తీరికగా ఉన్నారా?' అంటూ సరాసరి లోపలికి వచ్చేశాడు నారదుడు. "వత్సా! ఏమిటిలా వచ్చావు?" అడిగాడు శ్రీపతి. 'మరేం లేదు. ఋషులంతా చేరి సత్సంగం, సత్సంగం అంటుంటే దాని అర్థమూ, పరమార్థమూ తమనే అడిగి తెలుసుకుందామని వచ్చాను అంతే!' అన్నాడు నారదుడు. చిరునవ్వు నవ్వాడు తాతగారు.

మనవడితో ముచ్చటిస్తూ "దాని అర్థమే కాకుండా అనుభవం కూడా తెలుసుకునే సమయం వచ్చిందిప్పుడు. కనుకనే నీకా సందేహం కలిగింది. నీ నిరంతర నామస్మరణతో నీ హృదయంలో నన్ను బంధించుకున్న నీవు భూలోకం వెళ్ళు. అక్కడ నా సంకల్పానికి రూపకల్పన జరుగుతుంది. నువ్వు కేవలం నిమిత్తమాత్రుడవే. చాలు ఇక వెళ్ళిరా. శుభమస్తు!" అన్నాడు. తలాతోకా లేకపోయినా, జగన్నాటక సూత్రధారి ఆజ్ఞమేరకు నారదుడు భూలోకానికి పయనమయ్యాడు.

చాలా అందమైన ప్రదేశం అది. చెట్లన్నీ పూసి కాయలు కాసి పళ్ళుపండి కన్నుల విందుగా ఉన్నాయి. సెలయేరులు కోనేరులు నీళ్ళతో నిండుగా ఉండి జీవతృప్తి చేస్తున్నాయి. జంతువులు, పక్షులు రకరకాలుగా సందడి చేస్తూ, ఆ వనమంతా కళకళలాడిపోతున్నది. అక్కడ విహరిస్తునారా యక్షుల జంటలు. వారి విలాసాలు పరిహాసాలు వనదేవత నవ్వులతో శృతి కలుపుతున్నట్లున్నాయి.

'ఈ చల్లని సెలయేరులో స్నానాలు చేద్దామా?' అనుకున్నారా నలుగురూ. సై అంటే సై అనుకుంటూ, తాము ధరించిన వస్త్రాలన్నీ ఒడ్డున పెట్టి, నీళ్ళలోకి

దిగారు. వారి జలక్రీడలతో, ఆటపాటలతో వనమంతా మారుమ్రోగుతున్న ఆ వేళ......... దేవర్షి నారదుడు ఆ త్రోవన నడుస్తూ వారి కోలాహల ధ్వని చెవినిపడగా తల తిప్పి చూశాడు. నగ్నంగా ఉన్న ఆ దేహాలను చూసి ఒళ్ళు జలదరించింది ఆయనకు.

ఋషి రాకను గమనించిన ఆ జంటలలోని స్త్రీలు చప్పున గట్టుమీదకు వచ్చి వస్త్రాలు ధరించి నారదుని వద్దకు వచ్చి, వినయంగా నమస్కరించి ఆ చోటు విడిచి వెళ్ళిపోయారు.

కామంతో కళ్ళు మూసుకునిపోయి, మద్యపానంతో మత్తెక్కిన ఆ యక్ష కుమారులిద్దరూ వచ్చిన మునీంద్రుని గుర్తించక ఆయన ఎడల అపచారం చేస్తూ, వేళాకోళాలూ, వెక్కిరింతలు సాగించారు.

తన దివ్య దృష్టితో వారిని గుర్తించిన మునీశ్వరుని నోటివెంట 'నవనిధులకి అధిపతి అయిన కుబేరుని తనయులమనే గర్వంతో కొవ్వెక్కి ఒళ్ళెరక్కుండా ఉన్న మీరు భూలోకంలో అర్జున వృక్షాలై పడిఉండండి!' అని శాపం వెలువడింది.

మేఘ గర్జనవంటి ఆ వాక్కులు పరిసరాలన్నీ ప్రతిధ్వనిస్తుంటే, అప్పటికి తెలివి వచ్చిన యక్షకుమారులు తమ దుస్థితిని గుర్తించి, దుఃఖభారంతో కుప్పకూలిపోయారు. ఇద్దరూ దేవముని పాదాల మీద పడి పరిపరి విధాల విలపిస్తూ తమ శాపానికి విముక్తి మార్గం చెప్పవలసినదని వేడుకున్నారు. 'జగన్నాధుని దివ్యపాద స్పర్శతో మీకు శాప విముక్తి కలుగుతుంది' అని చెప్పి నారదుడు తిరోహితుడైనాడు.

పదివేల దివ్య సంవత్సరాల అనంతరం ........... ఫెళఫెళ మంటూ విరిగి పడ్డాయి ఆ తెల్లమద్ది చెట్లు రెండూనూ. మహతీనాదం మధురంగా మ్రోగిందా సమయంలో. సూర్యోదయాత్పూర్వం అరుణ రేఖలు విరిసినట్లు నారదముని అక్కడ ప్రత్యక్షమయ్యాడు.

గగన భాగాన నిలిచిన దేవగణమంతా వింతగా చూస్తూ 'నడుముకి కట్టిన తాడుతో బంధించిన రోలును ఈడ్చుకుంటూ చెట్ల మధ్య నుంచి వచ్చిన ఆ చిన్నారి బాలుని కాలి చిటికెన వ్రేలు తగిలి ఆ జంట వృక్షాలు కూకటి వ్రేళ్ళతో సహితం పెళ్ళగిలి కూలిపోయాయి. ఇంత చేసిన ఆ దివ్యబాలుడు.....' అని చెప్పుకుంటున్నారు. పడిన చెట్ల నుండి వెలువడి వచ్చిన దివ్యపురుషులిద్దరూ వినయ భయ భక్తులతో మహర్షిని చూసి వందనాలు చేశారు.

వారితో నారదుడు 'తన స్పర్శతో మీకు శాపం విమోచనం కలిగించిన యీ బాలుడు సాక్షాత్తు వైకుంఠవాసియైన శ్రీమన్నారాయణుడే' అనగానే ఆ

పురుషులిద్దరూ లీలావతారుడైన వైకుంఠవాసియైన పరమాత్మకు పరమానంద భరితులై సాష్టాంగపడి నమస్కరించారు.

నందగోపాలుడు నవ్వుతూ "మనవడా! గుర్తుందా! అలనాడు వైకుంఠంలో 'సత్సంగం అంటే ఏమిటి?' అని అడిగావు. నీ రాకకు ముందే కుబేరుడు వచ్చి, దుష్ప్రవర్తన కలిగిన తన తనయులనిద్దరినీ ఉద్ధరించమని ప్రార్థించాడు. నీ ద్వారా ఆ పని చేయ సంకల్పించాను. వారు దారిలో ఎదురయ్యేటట్లు చేసినందున, ఆ మూర్ఖుల నీచ ప్రవర్తన గమనించి, అలిగి ఐశ్వర్యమదమత్తులకు దరిద్రమే మందని వారికి శాపం ఇచ్చావు. సాధూనాం దర్శనం పుణ్యం అన్న విధంగా నీ దర్శనంతో వారి పాపాలన్నీ నశించాయి. అహంకారం అణిగిపోయింది. అయితే వారి దుష్ప్రవర్తనకి నిష్కృతిగా శాపం అనుభవించవలసి వచ్చింది.

ఆనాడు నీ పాదాలంటి ప్రణామం చేసిన వారికి వందనం మోక్షసాధనం అని అనుగ్రహించే గురుమూర్తివై నేడు నా దర్శనమూ, స్పర్శనమూ లభించే తీరుగా శాపవిమోచనం చూపి మోక్షమార్గాన్ని చూపించావు.

సత్య వస్తువుతో సంగమమం అంటే కలయిక జరిగినందుకు కర్మబంధ విమోచనమూ, జ్ఞాన సిద్ధి, ఉత్తమ గతిని కలిగిస్తుంది సత్సంగం. నాటి నీ సందేహానికి అనుభవ పూర్వకంగా సమాధానం లభించిందనుకుంటాను. ఏమంటావు?" నారదుని వీణానాదం విశ్వమంతా బ్రహ్మానందంలో ముంచింది. జగద్రచనా వినోదియైన పరబ్రహ్మ స్వరూపునిపై దివిజులు హర్షాతిరేకతో

*

# శ్రద్ధాంజలి

ఆశ్రమ స్థిర నివాసులు, శ్రీబాబు చిరకాల భక్తులు అయిన కూరాళ్ళ ఇందిరాదేవిగారు 3-12-2012 సోమవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 77 సంవత్సరాలు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె, కోడలు, అల్లుడు, మనుమలు, మనుమరాండ్రు కలరు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక!

వీరి కుటుంబసభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నాము.

# స్థిత ప్రజ్ఞుడు

- పరాశర ప్రసాద్

స్థితప్రజ్ఞుడు సమాధిలో ఉంటాడు సమాధిలో ఉన్న వ్యక్తి ఎలా ఉంటాడు, సమాధి నుండి లేచిన వ్యక్తి ఎలా ఉంటాడు. సమాధి స్థితిలో కూర్చోవటం లేవటం అనేది ఉండదు. స్థితప్రజ్ఞుడు సహజ సమాధిలో ఉంటాడు. ప్రజ్ఞ స్థిరమైనది. మార్పు పరిణామము ఉండవు. సద్గురుమూర్తి వెంట ఉండాలి లేదా యింట ఉండాలి.

జ్ఞానం కలగాలంటే రెండు పద్ధతులు ఉన్నాయి. 1. విధ్వంసక లేక నిర్మూలక విధానము. 2. విధాయక లేక నిర్మాణ విధానము. క్షేత్ర శుద్ధి జరగాలంటే కలుపు మొక్కలు నిర్మూలించనిదే ఎంత మంచి బీజములైనా మొలకెత్తవు. గృహస్థుడు, సన్యాసి దేహపోషణకు భిక్ష పెట్టవలసినదే. సన్యాసి గృహస్థునకు జ్ఞానభిక్ష పెట్టాలి. అది వారి వృత్తి ధర్మము. భిక్ష స్వీకరించినవారు ఎవరైనా సరే భగవన్నామ స్మరణ చేయాలి. అలా కాని పక్షంలో దోషం ఆవరిస్తుంది. మనస్సుకి రూపం లేదు. కోరికల సమూహమే మనస్సు. మనస్సుని శుద్ధి చేయాలంటే ధ్యానము, అర్చన, విచారణ చేయవలసినదే. మనస్సులో వాసన అనే పుండు సుఖదుఃఖాలకు కారణము. దానిని తీసివేస్తే కోరికలు ఉండవు. వాసనా రహిత స్థితియే జ్ఞానస్థితి. నూలు తీసివేస్తే వస్త్రము ఉండదు కదా!

ఎక్కడ కాముడు ఉంటాడో అక్కడ రామునికి స్థానం లేదు. చెవులతో త్రాగేది తరిగేది కాదు. అది జన్మ రాహిత్యానికి తీసుకువస్తుంది. అటువంటి గంగని అందించే వాడు స్థితప్రజ్ఞుడు. అశుద్ధ కామము, శుద్ధ కామము రెండూ తొలగవలసినదే. కామాన్ని సంపూర్ణంగా రహితం చేసుకోవాలి. జాగ్రత్స్వప్న సుషుప్తి అవస్థలలో కూడా వాసనా రహితం అయినప్పుడే స్థితప్రజ్ఞుడు అనిపించుకుంటాడు. బుద్ధి ఆత్మ యందు స్థిరంగా ఉండాలి. ఒక కుర్చీలో యిద్దరు కూర్చోలేరు కదా. మోహం నశించినంత మాత్రాన, కోరికలు రహితం చేసుకున్నంత మాత్రాన చాలదు. పట్టుకోవలసిన దాన్ని పట్టుకోవాలి. భార్యాబిడ్డలను, సంసారాన్ని వదలినంత మాత్రాన స్థితప్రజ్ఞుడు ఎన్నడూ కాజాలడు. మనస్సులోని సంకల్పాలను జయించాలి.

ఆశ్రమవాసం చేయవచ్చు. దానివలన సత్ఫలితాన్ని పొందాలంటే కార్యక్రమాలలో పాల్గొనాలి. విషపూరితమైన విషయానందాన్ని త్యజించాలి. ఆత్మానందాన్ని అనుభవించాలి. విషయాదులు తాత్కాలికంగా తియ్యగా ఔషధాలపై పంచదార కోటింగ్ లాగా తీయగా ఉండవచ్చు. ప్రపంచంలో అన్ని అందుబాటులో ఉన్న ఆనందం లేదు. ఏదో ఒక లోటు, అసంతృప్తి.

కాని మహాత్ములకి ఏమీ లేకపోయినా ఆనందమే. మానవుడు శబ్ద స్పర్శ, రూప, రస గంధాల వెంటపడి తమలోనే ఉన్న అసలైన ఆనందాన్ని అందుకోలేక

పోతున్నాడు. స్థితప్రజ్ఞుడు అలా కాకుండా మేనులో తానై, నేనులో తానై, జగత్తులో తానై ప్రకాశిస్తూ ఆనందిస్తున్నాడు. ఆయనకి యింక కోరికలతో పనేముంది? కోరికలను తొలగించుకోవలసిన పనేముంది? అసలు ఆయనకి కోరిక జనిస్తే కదా!

సద్గురు మూర్తి నీలో ఉన్న జగత్తు అనే భావన రహితం చేస్తాడు. ఇంక ఉండేది బ్రహ్మ భావనే కదా. భావన అనేది తెర మాత్రమే. తెర ఉన్నా, తీసేసినా ఉన్నది తానే కదా. అర్జునుడు శ్రీకృష్ణుణ్ణి అడిగిన ప్రశ్నకి సమాధానం మాటలతో చెప్పేది కాదు. అది కేవలం అనుభవమే. మానవుడు స్థితప్రజ్ఞుడు కావాలంటే సందేహాలు తొలగాలి. సందేహాలు తొలగనిదే సంకల్పాలు రహితం కావు. తలమీద వెంట్రుకలు తొలగించు కోవాలంటే తెల్లవి నల్లనివి అన్నీ తొలగిస్తావు. అలాగే సంకల్పాలు ఎలాంటివైనా రహితం కావలసినదే!

– సశేషం

'భగవన్నామమనే మణి ద్వీపాన్ని' నాలుక అనెడి గడప మీద ఉంచినచో, దేహమనెడి యింటి లోపల, బయట కూడా వెలుగు వెల్లివిరుస్తుంది. అప్పుడు సర్వత్ర మోక్ష దాయకమే గదా!

– తులసీదాస్

"నా ఎదురుగా గురువు, భగవంతుడు యిద్దరూ నిలిస్తే, ముందుగా గురువుకే పాదాభివందనం చేస్తాను. ఎందుకంటే భగవంతుణ్ణి దర్శించే మార్గము గురువే తెలిపాడు. అందుకే నాకు భగవంతుడికంటె గురువే ఎక్కువ!"

– భక్త కబీర్

"వ్యామోహ తరంగాలలో, సంసార సాగరంలో తలమునకలై దరిచేరే దారి కానక చేయూత కోసం పరితపిస్తున్న తన బిడ్డలను ఆదుకొమ్మనీ, చేదుకొమ్మనీ, చేయూత నిమ్మని కరుణామయి అయిన జగన్మాత ఈ రూపంలో నన్నిక్కడ నిలిపింది"

– బాబూజీ

గతసంచిక తరువాయి

# లక్ష్యార్థ సిద్ధి

-జి.వి. రత్నం

ఎన్నోజన్మల సుకృత ఫలంగా లభించిన మానవ జన్మను ఎలా సార్థకం చేసుకోవాలో ఏది తెలుసుకుంటే యిక తెలుసుకోవలసినది ఉండదో, దేన్ని చూస్తే నయనేంద్రియం సార్థకమవుతుందో దాన్ని తెలుసుకోవాలి. ఏ దివ్యనాథుని చరణార విందాలు సర్వపాతకాలను పారద్రోలగలవో, అట్టి పాదాబ్జాలను హృదయంలో నిలుపుకుని అర్చించుకుంటే ఆనందం, శాంతి లభిస్తాయి. హృదయపీఠానికి ఆ దివ్యచరణ కమల యుగమే నిజమైన అలంకారము.



ఆ చరణకమల మకరందము మధురాతి మధురము. ధరణి రుచులేవీ దానికి సాటిరావు. ఎక్కువ అయితే అజీర్తి రోగము, తక్కువ అయితే అసంతృప్తి రోగము, నీరసము. భగవన్నామ మాధుర్యము మాత్రము ఎంత తిన్నా వ్యాధిని రానీయదు. అంతేకాదు అన్ని రోగాలకంటే గొప్పదైన భవరోగాన్నే హరింపజేసి, ఆనందాన్నిస్తుంది. వెలలేని ఆత్మ బలాన్ని యివ్వగలది. ఆత్మబలాన్ని మించింది లేదు. అట్టి ఆత్మబలం కేవలం భగవద్ధ్యానం వలనే కలుగుతుంది. ధ్యానానికి సద్గురువు ప్రసాదించే లక్ష్యార్థమే ఆ బలము.

సద్గురువు అంటే సత్యగురువు. గీతాచార్యునివంటివారు. తాను సత్యమైన ఆనంద స్వరూపుడైతేనే తనను ఆశ్రయించిన వానికి ఆనందాన్ని అందించ గలడు. అంతేకాని, శిష్యుల ద్రవ్యాన్ని, సేవలను కోరేవాడు శిష్యులకేమి ప్రసాదించ గలడు?

గీతాచార్యుడు అర్జునునికి లభించినట్లు, గురునానక్ శిక్కులకు లభించినట్లు, సమర్థ రామదాసు శివాజీకి లభించినట్లుగా సత్యగురువు మనకు లభిస్తే అంతకంటే భాగ్యం మరొకటి లేదు. అట్టి గురువు మన హృదయకంజాతంలోని అజ్ఞాన తిమిరాన్ని పారద్రోలి, జ్ఞానభాస్కర కిరణాలను అందులో ప్రసరింపజేసి సంసార ప్రవాహంలో కొట్టుకుపోయే మానవుణ్ణి ఒడ్డుకు చేర్చగలడు.

'ఓం నమో నారాయణాయ' అనే అష్టాక్షరీ మహామంత్రాన్ని గురుముఖతః లక్ష్యార్థం పొంది, ఉదయం ధ్యానిస్తే రాత్రి చేసిన పాపాలన్నీ హరిస్తాయని, రాత్రి ధ్యానిస్తే పగలంతా చేసిన పాపాలన్నీ హరిస్తాయని నారాయణోపనిషత్తు చెబుతున్నది. మధ్యాహ్న సమయంలో ప్రొద్దు నడినెత్తిన పడుతుంది. నీడ నీలోనే కలుస్తుందిగాని భిన్నంగా కనబడదు. అప్పుడు మనస్సును లక్ష్యార్థం మీద నిలిపితే, గాలిలేని దీపంవలె నిలిచి పోతుంది.

అన్నం వడ్డించుకుని ఎదురుగా కూర్చుని చూస్తూ 'కడుపు నిండాలి, నాకు బలం రావాలి' అని స్మరిస్తే వస్తుందా? అది తింటే, దాని సారం రక్తనాళాలలోకి ప్రవేశించి బలాన్ని యిస్తుంది. అలాగే లక్ష్యార్థం ఒకచోట, మనస్సు మరొకచోట ఉంచి, లక్ష్యార్థ స్వరూపుడు తాను కావాలనుకుంటే ఎలా అవుతాడు? ఒక గ్లాసులో నీరు, మరొక గ్లాసులో పంచదార ఉంది. రెండు గ్లాసులనూ యుగాలపాటు ఎంత దగ్గరగా ఉంచినా, ఆ నీరు ఆ మధురత్వాన్ని పొందదు. అది ఆవరణ దోష ప్రభావం. ఆ ఆవరణను తీసివేసి నీటిని పంచదార గ్లాసులో పోస్తే, ఆ పంచదార నీటిలో పూర్తిగా కరిగి కలిసిపోతుంది. అది మధురమైన పంచదార పానకం అవుతుంది. దానిని అగ్నికి యిగరపెట్టినా, నీరు హరిస్తుందిగాని, శాశ్వత సత్యమైన మాధుర్యం అలాగే ఉండిపోతుంది.

ఇక్కడ మాధుర్యం అంటే ఆత్మవస్తువు. మనసు లక్ష్యార్థంలో లయించిన కొద్దీ మంత్రాధిష్ఠాన స్వరూపుడైన పరమాత్మునితో తదాకారం పొందుతుంది. అప్పుడు జపమాల ఆగిపోతుంది. శబ్దం నిలిచిపోతుంది. పెదవులు కదలవు మనస్సు కదిలితేనేగా ఇంద్రియాలు కదిలేది. మనసు నిలిచిపోయింది కనుక ఇంద్రియాలు పనిచేయవు. అదే సమాధి స్థితి. అందులో కలిగే ఆనందాన్ని ఏ శాస్త్రాలూ వర్ణించలేవు.

భావసమాధి పొందినది కొద్ది క్షణాలే అయినా, అటువంటి వ్యక్తి కనిపిస్తే ఆయన పాదధూళిని శిరస్సున ధరిస్తాడు మీ హృదయబాబు. అట్టి మహాత్ముడు ఎలా ఉంటాడు? నిరహంకారి, డంబాలు, ఆడంబరాలు ఉండవు. ప్రపంచ దృష్టిలేని నిరపేక్షుడాయన. స్వార్థ రహితంగా సర్వమానవులకూ సేవ చేయటమే ఆయనకు ఆనందం. ఎందుచేతనంటే ఆ మహాత్ముని మనస్సు అందరిలోనూ ఆ పరమాత్మునే దర్శిస్తుంది. అది సాధ్యమే. ఏదైనా ఆకారం గల ఒక మూసలో నీరుపోసి ఫ్రిజ్‌లో పెడితే అది కొంతసేపటికి చంచలత్వాన్ని కోల్పోయి నిశ్చలమైన తదాకారాన్ని ధరిస్తుంది.

– సశేషం

# అలసత్వమును పారద్రోలవలెను

-శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామి

పూర్వం ఒక పట్టణ సమీపంలో ఒక కుగ్రామం ఉంది. అందులో అనేక మంది రైతు కుటుంబాలు ఉండేవి. ఒకరోజు రాత్రి అందరూ నిద్రపోయే సమయంలో అర్ధరాత్రి ఊరిలోని గుడిసెలకు నిప్పంటుకుని భగభగ మండిపోతున్నాయి. గ్రామస్థులు అందరూ లేచి వారివారి సామాగ్రి బయటకు లాగి, ఆ తరువాత ఏం చేయాలో తోచక రచ్చబండ దగ్గర సభచేశారు. గ్రామ శాశన సభ అత్యవసర సమావేశం అయింది.

అందులో ఒకడు లేచి 'మహాజనులారా! ఇది ఆలోచించే సమయం కాదు. వెంటనే యింటికి ఒకరు చొప్పున వెళ్ళి తాటాకులు పెకలించి, మంట ఆర్పివేయాలి' అని అభిప్రాయం వెలిబుచ్చాడు. మరొకడు లేచి 'గౌరవ సభ్యుని అభిప్రాయంతో నేను ఏకీభవించటం లేదు. ఎందుకంటే ఆ కార్యం వలన నిప్పు పూర్తిగా శమించదు. కావున సమీపానే పట్టణం ఉంది. ఎవరైనా అక్కడకి పరుగెత్తుకుంటూ వెళ్ళి, నిప్పు చల్లార్చే యంత్రాన్ని తీసుకువస్తే, అది ఒక్క నిమిషంలో నిప్పంతటినీ చల్లార్చివేస్తుంది' అన్నాడు.

ఈ ప్రకారంగా సభలో ఒక్కొక్కరూ తోచిన అభిప్రాయాన్ని, భావాలను చెబుతుండగా, వారి మధ్యనుండి ఒక పెద్దమనిషి లేచి, "ఆయ్యా! ఈ మాటలన్నీ కట్టి పెట్టండి. మీరిచ్చిన సలహాలలో ఒక్కటి కూడా సందర్భోచితంగా లేదు. నేనెంతో ఆలోచించి చక్కటి ఉపాయం చెబుతున్నాను. దానిని విని ఆచరణలో పెట్టారంటే గ్రామాన్ని అగ్నికి ఆహుతి కాకుండా తప్పించగలరు. లేకపోతే మొత్తం పరశురామ ప్రీతి కాకమానదు. నేను చెప్పబోయేదేమంటే, గ్రామస్థులందరూ వారివారి పలుగులు పారలు తెచ్చి సమీపాన్నే ఒక బావి తవ్వితే కావలసినన్ని నీళ్ళు దొరుకుతాయి. ఆ నీటితో ఎంతటి అగ్నినైననూ సులభంగా ఆర్పివేయచ్చు. కాబట్టి ఆలోచించండి' అన్నాడు.

అది విని అందరూ ఫక్కున నవ్వారు. అలాగే నవద్వారములతో ఈ దేహమనే పంజరములో ప్రాణమనే పక్షి ఏ క్షణంలోనైనా సరే ఎగరటానికి సిద్ధంగా ఉన్న సమయంలో వ్యాధులు, విఘ్నాలు, అశాంతికర పరిస్థితులు తండోప తండాలుగా వచ్చి మీదపడుతుంటే మీనమేషాలు లెక్కపెడుతూ, కడతేరే మార్గాన్ని గూర్చి ఆలోచించక, దైవధ్యానానికి యింకా చాలా సమయముందిలే' అనే జనుల యొక్క ఆలోచన నిప్పు అంటుకున్నాక బావి త్రవ్వుదామనే ఆలోచనవలె ఉంది.

అందుకే భర్తృహరి ***సందీప్తే భవనే తు కూపఖనన ప్రత్యుద్యమః కీదృశః?*** అని గంభీరంగా ప్రశ్నించి, అట్టి దీర్ఘసూత్రులను పరిహసించాడు.

కాబట్టి విజ్ఞుడైనవాడు బాగా ఆలోచించి, అమూల్యమైన ఈ మానవ జీవితాన్ని భోగములందు కాక, యోగమందే వినియోగించాలి. ఆత్మ జ్ఞానాన్ని శీఘ్రంగా సంపాదించి జన్మ సాఫల్యాన్ని పొందాలి. భగవంతుని పాదపద్మాలను ఆశ్రయించి, భవరోగాన్ని బాపుకోవాలి.

*

# శ్రీగురు పాదాలు

– పళని

ఒకప్పుడు దక్షిణ దేశంలో ఒక సిద్ధపురుషుడైన మహమ్మదీయ గురువూ, మంచి శిష్యుడు ఉన్నారు. ఒక రోజున గురుశిష్యులిద్దరూ మంచి సత్సంగంలో ఉండగా, మక్కా యాత్రకు వెళుతున్న ఒక మహమ్మదీయ మౌల్వీ అక్కడకు వచ్చి, 'మక్కా, కాబాలు దర్శనీయమైన మహాదివ్య క్షేత్రాల'ని అనేక విధాల శ్లాఘిస్తూ అక్కడ ఉన్న శిష్యుణ్ణి కూడా తనతో యాత్రకు రమ్మనమని ప్రోత్సహించాడు.

ఆ ముఖ్యశిష్యుడు అత్యంత కోపావేశంతో ఆ మౌల్వీ తల పట్టుకుని, తన గురు చరణారవిందాల దగ్గరకు వచ్చి, "చూడు! కోట్లకొలది మక్కాలు, కాబాలు యీ చరణాలలో ఉన్నాయి" అని నొక్కి వక్కాణించాడు.

ఇదంతా నిర్మలంగా గమనిస్తున్న గురువుగారు మౌనంగా బయటకి వెళ్ళారు. మౌల్వీకి, ఆ శిష్యునకు యింకా వాగ్వివివాదం జరుగుతూనే ఉంది. గురువుగారు మళ్ళీ వచ్చి తన ఆసనంపై కూర్చున్నారు. మౌల్వీ గురువుతో శిష్యునిపై ఫిర్యాదు చేశాడు.

గురువు మౌల్వీ చెప్పినదంతా సత్యమేననీ, మక్కా, కాబాలు దర్శనీయమైన క్షేత్రాలనీ చెబుతూ ఆ శిష్యుణ్ణి మౌల్వీతో యాత్రలు చేసిరమ్మనమని చెప్పారు.

శిష్యుడు లేచి నిలబడి చేతులు మోడ్చి, 'గురువు ఆజ్ఞశిరసా వహిస్తాను' అని ప్రయాణమయ్యాడు.

ఆ శిష్యుడు, మౌల్వీ ఓడపై ప్రయాణం సాగిస్తున్నారు. కొంత దూరం వెళ్ళిన తరువాత పెనుతుఫాను చెలరేగింది. ఆ ఓడ ముక్కముక్కలు అయిపోయింది. ఆ శిష్యుడు తప్ప అందరూ మునిగిపోయారు.

ఆ శిష్యుడు ఒక దుంగపై కూర్చుని ప్రాణం దక్కించుకున్నాడు. ఆకాశాన్ని అంటే అలలు ఆ శిష్యుణ్ణి కూడా కబళించాలని చూస్తున్నాయి.

ఇంతలో సముద్రం మధ్యలో నుంచి ఒక హస్తం పైకి వచ్చింది. "నీ చేతిని అందించు. నిన్ను రక్షిస్తాను" అని ఒక అశరీర వాణి వినిపించింది.

శిష్యుడు 'మీరెవరు?' అని ప్రశ్నించాడు.

"నేను మహమ్మద్ ప్రవక్తను" అని జవాబు.

శిష్యుడు 'మహమ్మద్ ప్రవక్త ఎవరో నాకు తెలవదు. నేను గురువును తప్ప మరెవరినీ ఎరుగను' అన్నాడు.

ఆ హస్తం అదృశ్యమైంది. అలలు అతనిని తలకిందులుగా చేసివేస్తున్నాయి. ఇంతలో మరొక హస్తం పైకి వచ్చి "నన్ను పట్టుకో రక్షిస్తాను" అంది.

'ఎవరు నీవు?'

"నేను భగవంతుడను"

'నా గురువే నాకు భగవంతుడు. మరొక భగవంతుణ్ణి నేను ఎరుగను' అని బదులు పలికాడు శిష్యుడు.

కొంతసేపైన తరువాత మరొక హస్తం పైకి వచ్చి, "నేను నీ గురువునకు గురువును. నన్ను నమ్మి నీ చేతిని నాకందివ్వు. నిన్ను కాపాడటానికే వచ్చాను" అంది.

'నేను నా హస్తాన్ని నా గురువు ఒక్కరికే తప్ప మరెవరికీ యివ్వను. మీరెవరైనా అగుగాక! నేను మునిగినా, తేలినా అంతే! నేను నా గురుదేవుడి సహాయంతో తప్ప, నేను మరెవరి సహాయంతోనూ పైకిరాను' అన్నాడు శిష్యుడు.

అప్పుడు ఆ హస్తం కూడా మాయమైపోయింది.

ఇంతలో ఆ శిష్యుని ఎట్టనెదుట ఆ ఉత్తుంగ తరంగాల మధ్యలో అతని గురువు సాచిన హస్తాలతో ప్రత్యక్షమై శిష్యుణ్ణి గాఢాలింగనం చేసుకుని, ఆనందబాష్పాలతో శిష్యుని శిరస్సును అభిషేకించి, ఆకాశ మార్గాన శిష్యుణ్ణి యింటికి తీసుకుని వెళ్ళాడు.

అట్లాగ ఆ శిష్యుడు తన గురుదేవుడు పెట్టిన పరీక్షకు తట్టుకుని నిలబడి గురువుయొక్క అనుగ్రహాన్ని పొంది లోకానికే ఆదర్శప్రాయుడయ్యాడు!!

*



# తలచుకున్నప్పుడే అనుష్ఠానం ఆరంభించు

- స్వామి రామదాస

ఒక శెట్టికి చాలా ధనం ఉంది. అన్నదాన సత్రాన్ని తన స్వగ్రామంలో ప్రారంభించాడు. అతను స్వార్థపరుడు. అందరూ తనను గొప్ప దానకర్ణుడు అనుకోవాలనే ఆకాంక్షతో ఈ కార్యం మొదలు పెట్టాడు.

జొన్నలు అమ్మే టోకు వర్తకుడు యీ శెట్టి. సంవత్సరాంతంలో మిగిలిపోయి, పురుగులు పట్టి, ముక్కిపోయిన జొన్నల్ని సత్రానికి దానానికి పంపేవాడు. వీటి పిండితో రొట్టెలు చేసి ఆకలిగొన్నవారికి పెట్టేవారు.

శెట్టి కొడుక్కి పెళ్ళయి కోడలు కాపరానికి వచ్చింది. ఆమె సహృదయ, దానశీలి, ధైర్యశాలి, మేధావీను. మామగారి పిసినారితనానికి ఆమె చాల వ్యధ చెందింది. ఆయనకు గుణపాఠం నేర్పాలనే నిశ్చయానికి వచ్చింది. మామగారికి తనే వండి భోజనం పెడతానంది.

సత్రం నుంచి వాసన వస్తున్న జొన్న పిండి తెప్పించి, మామగారికి మొదటి రోజునే రొట్టెలు చేసింది. మామగారు భోజనానికి కూర్చున్నారు. మిగిలిన వంటకాలతో పాటు వాసనవచ్చే రొట్టెలు కూడా వడ్డించింది. దళసరిగా అందంగా ఉన్న రొట్టెల్ని చూసి, కోడలు తనకోసమేదో ప్రత్యేకమైన పదార్థమేదో చేసి ఉంటుందని తలచి, ముందుగా దాన్నే తినటం మొదలు పెట్టాడు. నోట్లో ముక్క పెట్టుకున్నాడో లేదో తుపుక్కున ఉమ్మేసి, "కోడలా! మన యింట్లో యింత మంచి పిండి ఉండగా, యిలాంటి పిండి నీకెక్కడిదమ్మా?" అని అరిచాడు.

"మామగారూ! నేను మన యింటికి రాగానే, సత్రంలో యిలాంటి రొట్టెలు దానం చేయటం గమనించాను. మనంచేసే దానానికి ఫలితంగా మనకు స్వర్గంలో అలాంటిదే లభిస్తుందని విన్నాను. మీరు అక్కడికి వెళ్ళాక కష్టపడకుండా, మీకు యిప్పటి నుంచే యిలాంటి రొట్టె అలవాటు చేస్తే మంచిదనీ, అప్పుడు ఎక్కువ కష్టపడనక్కర్లేదనీ యిలా చేశాను" అన్నది మేధావంతురాలైన కోడలు పిల్ల.

శెట్టికి కనువిప్పు కలిగింది. సత్రంలో పాడై పురుగులు పట్టిన జొన్నపిండిని అవతల పారవేయించి, మంచి పిండి పంపాడు. ఆ రోజు నుంచి అన్నార్తులకు మంచి మంచి రొట్టెలు దొరికాయి!!

-బులుసు మల్లిక్ USA

***వటుర్వా గేహీ వా యతి రపి జటీ వా తదితరో***
***నరో వా యః కశ్చిద్భవతు భవ కిం తేన భవతి,***
***యదీయం హృత్పద్మం యది భవదధీనం పశుపతే***
***తదీయస్త్వం శంభో భవసి భవభారం చ వహసి***



ఈ శ్లోకంలో శంకరులు సత్యాన్ని సందర్శించే మెళకువలని, అలాగే శివకారుణ్యానికి పాత్రులయ్యే మార్గాన్ని సాధకులకి బోధిస్తున్నారు. వేదాదులు దీనిని 'న ఇతి, న ఇతి' అని మాత్రమే సంబోధించగలిగాయో, అటువంటి పరతత్త్వ అనుభూతి కలుగకుండా మాయ తొలగదు. అపోహ తొలగదు. భయభీతులు తొలగవు. పరతత్త్వాన్ని గ్రహించాలి. తదుపరి దానిని ఆశ్రయించాలి. అప్పుడే కదా భవసాగర తరణం సాధ్యమవుతుంది.

'మూకా స్వాదనవత్' అంటుంది నారద భక్తి సూత్రం. పరతత్త్వాన్ని వర్ణించటానికి పదాలు జంకుతాయి. మనిషి ఉక్కిరి బిక్కిరౌతాడు. అందుచేత దాన్ని ఖండిచటవే తగిన ఉపాయం. అందుచేత కాబోలు శంకరులు కూడా శివానందలహరిలో ముముక్షువులకు పదేపదే 'నేతి' విద్యను సాధన చేయడం నేర్పుతారు. ఇక్కడ ఆశ్రమ ధర్మాలను దృష్టిలో పెట్టుకుని పరతత్త్వం వైపుకి మన దృష్టిని తీసుకెడుతున్నారు. బ్రహ్మచర్యాన్ని, గార్హస్థ్యాన్ని వానప్రస్థాన్ని మరియు సన్న్యాసాన్ని పరిశీలిస్తూ వాటిలో ఏ మార్గాన్ని అవలంబించినా మోక్షసాధన కావాలంటే ముఖ్యంగా కావలసిన ఏకైక లక్షణాన్ని మనముందుకు తెస్తున్నారు.

తొలుతుగా 'నేతి విద్య' అంటే ఏమిటో చూద్దాం. ఉదాహరణకి ఒకాయన తన యింటి నుండి బయలుదేరి దేవాలయానికి వెళ్ళబోతు నాలుగు రోడ్ల కూడలి వద్దకు వచ్చాడనుకుందాం. అక్కడ ఒక మార్గదర్శిని చూసి, ఇక్కడి నుంచి కుడిచేతివైపుకి వెళ్తే గుడి వస్తుందా అని అడిగాడు అనుకుందాం. దానికామార్గదర్శి లేదండీ అని చెప్పాడనుకుందాం. అదే విధంగా ఎడమవైపుకి వెళ్తేకూడా గుడి చేరుకోమని మార్గదర్శి చెప్పాడనుకుందాం. అంటే మార్గదర్శి నిజానికి గుడికెలా వెళ్ళాలో చెప్పలేదు. కానీ చెప్పాడు. ఎందుచేనంటే, ఇక మిగిలినది ఒక మార్గమే. కుడికాదు, ఎడమకాదు. తాను అప్పడిదాకా నడిచిన మార్గం కూడా కాదు. ఇక నేరుగా వెళ్ళడమొక్కటే మార్గం. అదే విధంగా కైవల్యానుభూతికూడ ఇప్పుడు చెప్పని 'నేతి విద్య' ద్వారా మాత్రమే సాధ్యం.

'వటుర్వాగేహీవా' అంటున్నారు ముందుగా. అంటే బ్రహ్మచర్యమైతేనేం, లేక గృహస్థాశ్రమమైతేనేం అంటున్నారు. కొంచెం పరిశీలించండి. ఈ రెండూ భిన్నమైన మార్గాలు. బ్రహ్మచర్యం ద్విజత్వానికి పునాదిరాయి. ఒక కుర్రవాడికి తన బాధ్యతలను ఎలాగ స్వీకరించాలో నేర్పేదే బ్రహ్మచర్యం. ఇందులో పక్వత చెందాక మోక్షసాధనకై కాశీయాత్రకి సంసిద్ధుడౌతాడు పిల్లవాడు. మార్గమధ్యంలో ఒక ఊరిలో ఒక తండ్రి అలాంటి గుణశీలుణ్ణి చూసి, తన బాధ్యతలనేగాక కుటుంబాన్ని పోషించగల సామర్థ్యం కలగటం చేత తన కుమార్తెకి తగిన వరుడని గ్రహించి, తన కన్య యొక్క పాణీగ్రహణం చేసి గృహస్థాశ్రమంలోకి ప్రవేశించమని కోరతాడు. అయితే చెప్పొచ్చేదమంటే బ్రహ్మచర్యమైనా, గృహస్థాశ్రమైనా ఫరవాలేదు. ముముక్షత్వం వీటికి భిన్నమైనది.

అలాగే 'యతిరపి జటీవా' అంటున్నారు. అంటే జటాధారులైతేనేం లేక శిఖసైతం పూర్తిగా ఖండించుకునే సన్యాసులైతేనేం అంటున్నారు. ఈ రెండూ కూడా పైనుంచి చూడటానికి భిన్నమైన మార్గాలుగా కనిపిస్తాయి. వానప్రస్థాశ్రమంలో ప్రవేశిస్తూ రాముడు నిషాదునితో 'జటలని ధరించి వనాలకు వెళ్లడానికి మర్రిపాలని తెమ్మంటాడు. అక్కడ తాపసులు ఎలా జీవిస్తారంటే కటిక నేలపైనే పరుంటారు. కందమూలాలని స్వీకరించటంతో సంతుష్టులౌతారు.

ఇంకా 'నరోవా యః కశ్చిద్భవతు' అంటున్నారు. ఇలా ఏ ఆశ్రమమైతేనేం, ఏ వర్ణమైతేనేమి ఎలాంటి జీవితమైతేనేమి బయటకు బాగానే కనిపించవచ్చు. కాని ఈశ్వరుని ఆశ్రయించాలంటే అంతరంగమే ముఖ్యము అంటున్నారు శంకరులు. దానికే హృత్పద్మాన్ని భగవంతునికి అర్పించమంటున్నారు. అంటే మన మనస్సుని, మనస్సులోని తలంపులని భగవంతునికి అర్పించాలన్నదే శంకరుల తీర్మానం.

'శంభో భవసి భవ భారంచ వహసి' రైలు బండి ఎక్కాక, మనలను, మన సామాగ్రి భారాన్ని కూడా ఎలాగైతే రైలుబండే వహిస్తుందో, అలాగే సదాశివుడు మన భవభారాన్ని తప్పక వహిస్తాడు అంటున్నారు శంకరులు. అటువంటి అంతరంగ సమర్పణకి మనం సంసిద్ధులమవుదాం! తరిద్దాం!!

# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

గత సంచిక తరువాయి

- విజయేశ్వరానంద ప్రసాద్

## చిరంజీవిరాజుగారితో శ్రీబాబు

రాజుగారు శ్రీబాబు కాళ్ళమీదపడి 'క్షమించండి బాబూ! ఆనాటి నుండి మళ్ళీ యింతవరకూ దీనిని ముట్టలేదు. ఎందుకో యీ రోజు నాకీ పెడబుద్ధి పుట్టింది' అన్నారు.



"అందుకే కదయ్యా! నేను పరుగెత్తుకుంటూ వచ్చింది. తనను నమ్ముకున్న శిష్యుడి మనస్సులో, ఏ కణంలోనైనా ఏ పెడబుద్ధియైనా పుట్టే అవకాశం ఉందని దాన్ని ఆ క్షణంలోనే తుడిచివేయకపోతే అది మరింత చెలరేగుతుందనీ, అప్పుడు దానిని త్రుంచటానికి మరింత కష్టం తనకు తప్పదనీ, వెయ్యి కళ్ళతో కనిపెట్టుకుని ఉండక తప్పుతుందాసత్యగురువుకి" అన్నారు శ్రీబాబు రాజుగారిని లేవదీస్తూ.

"మళ్ళీ యింకెప్పుడు జీవితంలో యీ పొరపాటు చెయ్యను. నన్ను క్షమించండి బాబూ!" అన్నారు రాజుగారు. "ఆనాడు కూడా సరిగ్గా యిదే మాట అన్నావు మరి? జాగ్రత్త కూడా చెప్పాను?" అన్నారు శ్రీబాబు. రాజుగారు ఆ గ్లాసు తీసుకెళ్ళి బయటపారవేసి వచ్చి, శ్రీబాబు పాదాలు తాకి "మీ పాదాలపై ఆన" అన్నారు. "తథాస్తు!" అన్నారు శ్రీబాబు.

శేషమాంబగారు శ్రీబాబును 'పెద్దబ్బాయి' అని. రాజుగారిని 'చిన్నబ్బాయి' అని పిలిచేవారు. కుమారి చంద్ర కూడా శ్రీబాబును, రాజుగారిని అలాగే పిలిచేది. తరువాత శ్రీబాబును 'అయ్యా!' అని పిలిచేది. ఎంతో చొరవగా చంద్ర శ్రీబాబు ఒడిలో కూర్చుని ఆడుకొనేది. భయం అనేది తెలిసేదికాదు. శ్రీబాబు కూడా చంద్రను 'అమ్మడూ!' అని, 'చందూ!' అని పిలుస్తూ ఒడిలోకి తీసుకుని ఆడించేవారు.

చంద్ర యింకా చాలా చిన్నపిల్లగా ఉండగానే శ్రీబాబు ఒకసారి భీమడోలు వచ్చారు. పాపను తీసుకుని చాలసేపు ఆడించారు. శ్రీబాబు ఒడిలో పడుకుని అలాగే నిద్రపోయింది. కొంతసేపటికి చంద్ర మెలకువ వచ్చి చూసేసరికి తాను బాబు ఒడిలో లేనట్లు గ్రహించింది. ఆ చిన్నారి శ్రీబాబు కోసం చుట్టూ చూసి వెతికింది. తన వెనుకవైపు శ్రీబాబు అటు తిరిగి ధ్యానం చేస్తున్నట్లు గమనించింది. తాను అతి జాగ్రత్తగా, చప్పుడు చేయకుండా, శ్రీబాబు ధ్యానానికి భంగం కలగకుండ అలాగే శ్రీబాబు వంక చూస్తూ పడుకుంది.అంతలో శ్రీబాబు కనిపించకుండా ఆ స్థానంలో పెద్ద కాంతిపుంజం కళ్ళు

మిరుమిట్లు గొలుపుతూ కనిపించింది.చంద్ర భయపడకుండా తాను కూడా ధ్యానం చేస్తున్నట్లు అలాగే కళ్ళు మూసుకుని పడుకుంది.

కొంతసేపటికి కళ్లు తెరిచి చూస్తే అంతా మామూలుగానే ఉంది. చంద్ర శ్రీబాబు వంక చూసి "పెద్దబ్బాయి ఎంత వెలుగో! అదేమిటి?" అని అడిగింది. "అదేనమ్మా నా స్వరూపం! నీ స్వరూపం కూడా అదే!" అని చంద్రను ఒడిలోకి తీసుకున్నారు శ్రీబాబు. ఇది శ్రీబాబుతో తమకు కలిగిన తొలి అనుభవం అని చంద్ర స్వయంగా చెప్పారు.

చిరంజీవిరాజుగారు క్రమశిక్షణ విషయంలో చండశాసనులు. వారి ధర్మపత్ని రాఘవమ్మగారి దైనందిన చర్య అసిధారా వ్రతంగా నడిచేది. ఏకైక కుమార్తె చంద్ర నాలుగైదేళ్ళ బాలిక అయినా ఆమె కూడా విధిగా క్రమశిక్షణ పాటించవలసినదే. శ్రీబాబు వారింట్లో పూజ చేసుకుంటున్న సమయంలో, చంద్ర తప్పకుండా వారి సమీపంలో కూర్చుని శ్రద్ధగా గమనించేది. ఒకసారి శ్రీబాబు పూజా సమయంలో చంద్ర ఆడుకుంటూ బయట ఉండిపోయింది. అది గమనించిన రాజుగారు ఆరోజు సాయంత్రం పూజ కూడా అయ్యేవరకు చంద్రకు పాలు కూడా యివ్వటానికి వీలులేదని శాసించారు.

చంద్ర ప్రతిరోజూ చదువుకోవటానికి రామ్మూర్తి మాష్టారుగారింటికి వెళ్ళేది. ఒకరోజు తోటిపిల్లలతో ఆడుకుండూ ప్రైవేటుకి వెళ్ళటం మానేసింది. రాజుగారు యింటికి వచేచ్చరికి యీ విషయం తెలిసింది.రాజుగారు వాకిట్లోకి వచ్చి బిగ్గరగా 'చంద్రా!' అని కేకవేశారు. ఆ కేక విన్న చంద్ర హడలిపోతూ యింట్లోకి వచ్చింది. రాజుగారు చంద్రని చితకబాదారు.భయంతో వణికిపోయిన ఆ పాప ఏడుపు బయటకు వినబడనీయలేదు కానీ, బట్టలు తడిపేసుకుంది.

ఆ తరువాత ఆమె శ్రీబాబు వద్ద ఆధ్యాత్మిక శిక్షణ పొందే సమయంలో ఏదైనా పొరపాటు చేస్తే శ్రీబాబు "మీ నాన్న కొడితే బట్టలు తడిపేసుకోవటంతో సరిపెట్టావు. కానీ, నాకు కోపం తెప్పించావంటే ఒకటి కాదు, రెండు కూడా చేసుకుంటావు జాగ్రత్త!" అని హెచ్చరించేవారని చంద్ర స్వయంగా తెలిపారు.

నిజమే! పొట్టకూటి విద్యలు నేర్చుకోవటానికే ఎంతో క్రమశిక్షణ అవసరం అయితే మరి మనస్సును అదుపులో పెట్టవలసిన ఆధ్యాత్మిక విద్య విషయంలో యింకెంత క్రమశిక్షణ అవసరం!

– సశేషం



# శ్రీ రాధా మాధవ రస సుధ

– శ్రీ హనుమాన్ ప్రసాద్ పోద్దార్

ప్రాణనాథా! నేను నీకు నిత్యదాసిని.
ఓ నా జీవనధనమా! నేను నీ పాదార్పితను.
నీవు నా పట్ల ప్రేమాతిరేకం చూపవచ్చు – మనసా, దైహికంగా నీ దానినిగా
అనుగ్రహించ వచ్చు;
నాకు ద్రోహం చేయవచ్చు; భయపెట్టి కలత పెట్టవచ్చు; తిరస్కరించి
త్రోసిపుచ్చవచ్చు.
నీ సుఖమే నా సుఖం, ఇతర సుఖాలను
ఈషణ్మాత్రమూ నేనెరుగను.
నా దుఃఖమే నీకు సుఖమైనా అదే నాకు అనుపమ
సుఖం.
నీ కోసం నేను సుఖం అనుభవిస్తున్నానేగాని,
మరొకటి నా మనస్సులో లేదు.
నీవు దివారాత్రాలలో సాయం సంధ్యలలో ప్రతి
క్షణం సుఖంగా ఉండగా చూడాలని
నా ఆకాంక్ష.
నీవు సుఖపడుతూంటే చూడటం కొరకే, నా
తనువుకూ మనసుకూ  సుఖమిస్తున్నాను.
నీకు అర్పించుకుని సదా నీ ఇష్టప్రకారం నిన్ను  సేవించుకుంటాను.
నన్ను 'ప్రాణేశ్వరీ!' హృదయేశ్వరీ!, 'కాంతా!' అని పిలవడం నీకు సుఖకరమైతే, నా
మనస్సు సంకోచపడుతున్నప్పటికీ, వాటిని స్వీకరిస్తాను.

నీ రాధ



## విజయవాడలో సత్సంగ సమావేశాలు

1-2- 2013 శుక్రవారం నుండి 4-2-2013 సోమవారం వరకు విజయవాడ లోని మొగల్రాజపురం నందున్న సిద్ధార్థ ఆర్ట్స్ కాలేజీ ఆడిటోరియంలో సాయంత్రం 5గం.ల నుండి 6గం. వరకు సంకీర్తన, 6గం. నుండి 8గం.ల వరకు శ్రీశ్రీశ్రీ యోగిని చంద్ర కాళీ ప్రసాద మాతాజీవారిచే అనుగ్రహ భాషణ జరుగును.

అందరూ ఆహ్వానితులే!!

విఠ్ఠు  కథలు

-రమణ ప్రసాద్

# జ్ఞానదేవుడు

రామానందస్వామి "ఋగ్వేదంలో 'ప్రజ్ఞానం బ్రహ్మ' అని, యజుర్వేదంలో 'ఆయామాత్మ బ్రహ్మ' అని, సామవేదంలో 'తత్త్వమసి' అని, అధర్వణ వేదంలో 'అహం బ్రహ్మోస్మి' అని చెప్పబడే ఈ మహావాక్యాలు శిరోభూషణాలు. వాటి అర్థాన్ని చెబుతాను శ్రద్ధగా విను.



'ప్రజ్ఞానం' అంటే 'ఆత్మ', 'బ్రహ్మము' అంటే 'పరమాత్మ'. ప్రజ్ఞానస్వరూపమే బ్రహ్మమని తెలియ చేయుటయే మొదటి వాక్యం యొక్క అంతరార్థం. శబ్ద, స్పర్శ రూప, రస గంధములను తెలుసుకొనే ఇంద్రియాలను, ఆ ఇంద్రియాలను తెలుసుకొనే అంతః కరణములను, ఆ అంతఃకరణాలను తెలుసుకొనే వీటిని మరుగు పరచు అవిద్యను తెలుసుకొనుచు సాక్షీమాత్రంగా భాసించే పదార్థమే 'ప్రజ్ఞానం బ్రహ్మ',

సమస్త పదార్థములలోపల నివసించి వానిని తెలుసుకొను సర్వసాక్షియే బ్రహ్మమని వేదాలు చెపుతున్నాయి. బహువిధ నామములకు ఆధారమై సాక్షీమాత్రంగా ఉన్న జ్ఞానమే ఆత్మ, బహువిధములకు ఆధేయమై సర్వసాక్షిగా ఉన్న బ్రహ్మమే పరమాత్మ అని వేదాంత శాస్త్రాలు తెలుపుతున్నాయి" అని చెప్పాడు.

విఠల్‌పంత్ ఆత్మస్వరూపము ఎట్టిది? అని అడిగాడు. స్వామి "ఇంద్రియ మనోవికారాలను నిగ్రహించి, మానావమానాలను దూరంచేసి మౌనముద్ర ధరించి, సంకల్ప వికల్పాలను అణిచి పెట్టి, నిర్వికల్ప సమాధిలో నిశ్చలత పొంది సుఖంగా ఉండటమే బ్రహ్మోనుసంధానమందే ఆత్మస్వరూపము" అని చెప్పాడు.

కొంతకాలం గడిచాక రామానందస్వామి ఆశ్రమబాధ్యతలు చైతన్య

స్వామికి అప్పగించి కొందరు శిష్యులను వెంటబెట్టుకొని తీర్థయాత్రలు దర్శిస్తూ ఆళింది చేరాడు. సిద్ధోపంత్ తన కుమార్తె రుక్మాబాయిని తీసుకొని ఆ యతివరేణ్యుని దర్శనానికి వెళ్ళాడు. రుక్మాబాయి స్వామి పాదాలకు వినమ్రతతో నమస్కరించింది. ఆమె భక్తిశ్రద్ధలకు సంతోషించి 'పుత్రవతీ భవ' అని ఆశీర్వదించారు. ఆ మాటలు విని రుక్మాబాయి ఫక్కున నవ్వింది. "ఎందుకు అలా నవ్వుతున్నావు" అని అడిగారు స్వామి. సిద్ధోపంత్ జరిగిన వృత్తాంతాన్ని చెప్పాడు.

అది విన్న రామానందస్వామికి సందేహం కలిగింది. తన దగ్గర సన్యాసాశ్రమం స్వీకరించిన చైతస్వామియే ఈమె భర్త అయిఉండవచ్చు అని గ్రహించారు. రుక్మాబాయిని వెంటబెట్టుకొని కాశీ నగరం చేరారు. సంతానము లేని గృహస్తుడు భార్య అనుమతి లేకుండా సన్యాస దీక్ష తీసుకొనటం దోషమని, అట్టి శిష్యునికి సన్యాసదీక్ష ఇచ్చిన గురువుకూడా అపచారం చేసినవాడే అని చెప్పి, చైతన్యస్వామిని గృహస్థాశ్రమ ధర్మాన్ని పాటించమని ఆనతి ఇచ్చారు రామానందులు.

విఠల్‌పంత్ అలంది చేరి గృహస్థ జీవనాన్ని ప్రారంభించాడు. అలంది గ్రామ ప్రజలంతా విస్తుపోయారు. సన్యాసి తిరిగి గృహస్థాశ్రమంలో ప్రవేశించటం అనుచితం అని భావించారు. అతడు భ్రష్టుడు అయ్యాడని నిర్ణయించారు. వర్ణానికే అప్రతిష్టతెచ్చాడని నేరారోపణ చేశారు. అతనితో ఎవరూ మాట్లాడకూడదు అని నిర్ణయించి చివరకు కులంనుంచే వెలివేశారు.

కొంతకాలానికి సిద్ధోపంత్ మరణించాడు. విఠల్‌పంత్ రుక్మాబాయి ఇద్దరే మిగిలారు. సంఘంలో వారికి సముచిత స్థానం లభించలేదు. జీవచ్ఛవంలాగా బ్రతుకుతున్నారు. ఇక అలందిలో ఉండటం ఇష్టంలేక ఒక అరణ్య ప్రదేశంలో ఒక చిన్న కుటీరాన్ని ఏర్పరుచుకొని అక్కడ జీవించసాగారు.

కొంతకాలానికి వారికి ముగ్గురు కుమారులు ఒక కుమార్తె కలిగారు. పెద్దవానికి నివృత్తిదేవుడని, రెండవవానికి జ్ఞానదేవుడని, మూడవవానికి సోపానదేవుడని, కుమార్తెకు ముక్తాబాయి అని నామకరణం చేశాడు. పాండురంగ వరప్రసాదంగా జన్మించిన ఈ నలుగురూ నాలుగు వేదాలకు ప్రతీకలుగా కన్పించసాగారు. పెద్దలయెడ పూజ్యభావము, నిరంతరహరినామ సంకీర్తనం, మృదుభాషణం వారికి ఉగ్గుపాలతో అబ్బాయి. అయినా వారు సంఘం దృష్టిలో దోషులుగానే పరిగణించబడుతున్నారు. తమవల్ల ఆపిల్లలకు

కలిగిన దీనావస్థకు ఆ తల్లిదండ్రులు లోలోపల కుమిలిపోతున్నారు.

త్రయంబకేశ్వరంలో జరిగే రథోత్సవం చూడటానికి పిల్లలను భార్యను వెంటపెట్టుకొని వెళ్ళాడు విఠల్‌పంత్. రథోత్సవ వైభవాన్ని తిలకించి వస్తూంటే పులి గాండ్రింపు వినిపించి ప్రజలంతా చెల్లాచెదురు అయ్యారు. పెద్దవాడైన నివృత్తిదేవుడు తప్పిపోయాడు. నివృత్తిదేవుడు పరిగెత్తుకుంటూ వెళ్ళి ఒక గుహలో ప్రవేశించాడు. ఆ గుహలో గోరఖ్‌నాథుని శిష్యుడైన గహనీనాథుని కలుసుకకున్నాడు. గహనీనాధుడు అతనికి దీక్షనిచ్చి శ్రీకృష్ణుని దివ్యలీలలను గానం చేస్తూ నామప్రభావాన్ని ప్రజలలో ప్రచారంచేయమని చెప్పాడు. గహనీనాథ్‌చే ప్రభావితుడైన నివృత్తి, నివృత్తినాథ్‌గా మారాడు. నివృత్తినాథుడు స్వగృహంచేరి తమ్ముడైన జ్ఞానదేవునికి దీక్షనిచ్చాడు. జ్ఞానేశ్వరులు సోపాన్‌కి, ముక్తాబాయికి దీక్ష ఇచ్చారు.

దినదిన ప్రవర్ధమానమవుతున్న కుమారులకు ఉపనయన సంస్కారం చేయాలని విఠల్‌పంత్ సంకల్పించి తన అభీష్టాన్ని ప్రధాన పురోహితులకు, విప్రోత్తములకు చెప్పగా వారు నిరాకరించారు. ఆశ్రమ భ్రష్టత్వం పొందిన విఠల్‌పంత్ శిక్షార్హుడని, చేసిన తప్పుకు ప్రాయశ్చిత్తం చేసుకోవాలని, నదిలోదూకి మరణించటమే ప్రాయశ్చిత్తమని చెప్పారు.

విఠల్‌పంత్ ఆలోచించాడు. తన వల్ల తన బిడ్డలకు అపకీర్తి వస్తోంది, తాను ప్రాణత్యాగంచేస్తే వారి బ్రతుకులు బాగు పడతాయి అని భావించాడు. తన భార్యని వెంటబెట్టుకొని అలహాబాదులోని త్రివేణీ సంగమంలో భార్యాసమేతంగా ప్రాణత్యాగం చేశాడు.

తల్లిని తండ్రిని పోగొట్టుకొన్న నలుగురు పిల్లలు చెట్టును విడచిన పక్షులులాగా మిగిలారు. ముక్కుపచ్చలారని వయసులో తమబ్రతుకు బాటను తామే నిర్మించుకోవాల్సిన స్థితికి గురయ్యారు.

-సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL